జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్...
రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 7 సంచిక 60 | హైదరాబాద్, మే 16 మంగళవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

## ఉపాధి, ఉద్యోగ కల్పనతో రాష్ట్రానికి..

# అపార సంపద



### కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ ప్లాంట్‌కు మంత్రి కేటీఆర్ భూమి పూజ



**రంగారెడ్డి జిల్లాలోని కొంగరకలాన్‌లో ఏర్పాటు చేస్తున్న ఫాక్స్‌కాన్ టెక్నాలజీస్ ప్లాంట్‌కు మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం 196 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. సుమారు రూ.1,656 (200 మిలియన్ డాలర్లు) కోట్లకుపైగా పెట్టుబడితో ఫాక్స్‌కాన్ ఇక్కడ తయారీ కేంద్రానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్‌లియూతో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.**

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ రోజు తెలంగాణకు చరిత్రాత్మక సందర్భమని అన్నారు. మార్చి 2న సీఎం కేసీఆర్ సమక్షంలో ఫాక్స్‌కాన్‌తో ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. రెండు నెలల్లోనే కంపెనీకి భూమి పూజ చేసుకున్నాం. ఇక్కడి వేగం, సమర్థ నాయకత్వం ఎక్కడా లేదని ఫాక్స్‌కాన్ ప్రతినిధులు చెప్పారన్నారు. తెలంగాణ వేగవంతమైన పనితీరుకు ఇది నిదర్శమనమని కేటీఆర్ వెల్లడించారు. దేశంలో ఉన్న ప్రధాన సమస్య ఉపాధి కల్పన అని మంత్రి కేటీఆర్ చెప్పారు. ప్రజలందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం ప్రపంచంలో ఎక్కడా సాధ్యం కాదు. ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ ఉద్యోగాలు 2 శాతమే ఉంటాయి. స్వయం ఉపాధి, ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనతో రాష్ట్రానికి అపార సంపద సమకూరుతుందన్నారు. ఫాక్స్‌కాన్ రంగారెడ్డి జిల్లాకు రావడం మనందరికీ గర్వకారణమని కేటీఆర్ పేర్కొన్నారు. రానున్న ఐదేండ్లలో కొంగరకలాన్ గుర్తు పట్టలేనంతగా మారబోతున్నదని చెప్పారు. రూ. 4 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఫాక్స్‌కాన్ పరిశ్రమతో 35 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. వచ్చిన పరిశ్రమలను కడుపులో పెట్టుకొని కాపాడుకోవాలి. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇస్తామని ఫాక్స్‌కాన్ హామీ ఇచ్చింది. అటు కంపెనీ నిర్మాణం జరుగుతుంటే మరోవైపు యువతకు శిక్షణ ఇస్తామన్నారు. యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్రంగా ఏర్పడిన 9 ఏండ్లలోనే దేశ స్థాయిలో తెలంగాణ అందరి మన్ననలు పొందుతున్నదని చెప్పారు. తెలంగాణలోని ఏ రంగాన్ని తీసుకున్నా దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పారు. చిన్న రాష్ట్రమైనా 30 శాతం కంటే అధిక అవార్డులను సాధించిందన్నారు.



## మే 17న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం కేసీఆర్ భేటీ

హైదరాబాద్ : తెలంగాణ భవన్‌లో మే 17వ తేదీన బీఆర్ఎస్ లెజిస్లేటివ్, పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఈ సమావేశం కొనసాగనుంది. ఈ సమావేశానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు. కర్నాటక ఎన్నికలతో పాటు రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలపైనా చర్చించనున్నారు. మరోవైపు.. బీఆర్ఎస్ పార్టీ బలోపేతంపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కర్నాటక ఎన్నికల ఫలితాల ఎఫెక్ట్.. బీఆర్ఎస్ పార్టీపై పడుతుందనే నడుస్తున్న చర్చపైనా మాట్లాడే అవకాశం ఉంది.

## పంటల ఉత్పత్తిలో భారత్ ముందంజ..

### సేంద్రీయ వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సాహం




హైదరాబాద్ : పంటల ఉత్పత్తిలో భారత్ ముందంజ..సేంద్రీయ వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సాహం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని "విస్తరణ విద్యాసంస్థ" లో నూతనంగా నిర్మించిన ఆడిటోరియాన్ని కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ప్రారంభించారు. భారతదేశం అనేక పంటల ఉత్పత్తిలో ప్రథమ శ్రేణిలో ఉందన్నారు. దిగుమతులు చేసుకునే స్థాయి నుంచి ఎగుమతులు చేసుకునే స్థాయికి దేశం ఎదిగిందని మంత్రి వివరించారు. భారతదేశానికి వ్యవసాయ రంగం వెన్నెముకని కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ అభిప్రాయపడ్డారు. మారుమూల ప్రాంతాలలో ఉండే సన్న, చిన్న కారు రైతాంగాలకి సైతం అందుబాటులోకి తీసుకురావాలని తోమర్ సూచించారు. పంటల ఉత్పత్తి, ఉత్పాదకతల్ని అధికం చేయడానికి, నష్టాల్ని తగ్గించడానికి, మార్కెట్ అనుసంధానం చేయడానికి టెక్నాలజీలని విరివిగా వినియోగించుకోవాలన్నారు. కిందిస్థాయి రైతాంగం వరకు శిక్షణ ఇవ్వాలన్నారు. సేంద్రియ, సహజ వ్యవసాయ విధానాలకి కేంద్రం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. జి-20 కి నాయకత్వం వహించే అవకాశం మన దేశానికి రావడం గర్వకారణం అని నరేంద్ర సింగ్ తోమర్ అన్నారు.



## గ్రాండ్ మాస్టర్ ప్రణీత్‌ను దీవించిన కేసీఆర్

హైదరాబాద్ : చదరంగ యువ సంచలనం ఉప్పల ప్రణీత్ గ్రాండ్ మాస్టర్ హోదా దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఆరేండ్ల వయసులో పావులు కదపడం నేర్చిన ఈ హైదరాబాదీ.. పదిహేనేండ్ల వయసులోనే భారత 82వ గ్రాండ్ మాస్టర్‌గా గుర్తింపు సాధించిన ప్రణీత్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ దీవించారు. తెలంగాణ సచివాలయంలో కేసీఆర్‌ను ప్రణీత్‌తో పాటు అతని తల్లిదండ్రులు కలిశారు. ప్రణీత్ తల్లిదండ్రులకు కేసీఆర్ అభినందనలు తెలిపారు. రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రణీత్‌కు శిక్షణ, ఖర్చుల కోసం రూ. 2.5 కోట్లు ప్రకటించారు కేసీఆర్.

## కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేవడం కేసీఆర్ కు చేత కాలేదు : మల్లు భట్టి విక్రమార్క



రంగారెడ్డి :వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుతో బీఆర్ఎస్ కు పోటు పొడిచి.. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కడుతారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు లక్ష్మీదేవి రిజర్వాయర్ ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృష్ణా జలాల్లో తెలంగాణ వాట తేవడం చేత కాలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిత్యావసర సరుకుల ధరలను నియంత్రిస్తామన్నారు. ఒక ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే.. ఇద్దరికీ పెన్షన్ ఇస్తామన్న భట్టి.. రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేయించుకోవడం కోసం ఆరోగ్యశ్రీని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. యువకులకు నిరుద్యోగ భృతి నెలకు రూ.4 వేలు ఇస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి సభలో మల్లు భట్టి విక్రమార్క ఈ కామెంట్స్ చేశారు. దశాబ్దాలు గడుస్తున్నా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం కావడం లేదని, నీళ్లు రావడం లేదన్నారు మల్లు భట్టి విక్రమార్క. రాష్ట్రాన్ని పాలించే పెద్దలకు ప్రాజెక్టు పూర్తి చేయాలనే సంకల్పం లేదు కాబట్టే నిర్మాణం చేపట్టలేదన్నారు. ప్రజల అవసరాల కోసం కాంగ్రెస్ హయంలో శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల, కల్వకుర్తి లాంటి ప్రాజెక్టులను నిర్మించామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాణహిత చేవెళ్లను చంపి.. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని చెప్పారు. కాళేశ్వరం గోదావరి నది మీద కట్టిన చెక్ డ్యామ్ మాత్రమే అని, దాని వల్ల ఒక్క ఎకరాకు నీరందలేదన్నారు. ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు దండుకోవడమే వారిపనన్నారు. "లక్ష్మీదేవిపల్లికి జూరాల నుండి నీరు పారించాలి. నీళ్లు పారించడానికి గతంలో ఉన్న ఆంధ్ర పాలకులు అడ్డులేరు కదా.. ఇప్పుడున్నది మీరే కదా.. ఎందుకు పారడం లేదు. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా కృష్ణానది నుండి ఒక్క చుక్క నీరు కూడా పాలమూరుకు పారలేదు" అని వ్యాఖ్యానించారు. లక్ష్మీదేవిపల్లి రిజార్వాయర్ పూర్తి చేయకపోతే ఈ ప్రాంతంలో ఓట్లు అడగనన్న సీఎం కేసీఆర్.. ఇచ్చిన మాట మీద నిలబడాలన్నారు. దున్నే వాడిదే భూమి యాక్ట్ మొట్టమొదటిసారి చట్టం తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. భూముల్లేని ప్రజలకు భూములు ఇచ్చామని చెప్పారు.

# కాంగ్రెస్ వైపు సీపీఐ చూపు..

హైదరాబాద్ : కర్నాటక ఎన్నికల ఫలితాల ప్రభావం రాష్ట్రంపై పడింది.




ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీలు వ్యూహం మార్చుకొనే పరిస్థితి కనిపిస్తోంది. మునుగోడు ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ కు మద్దతు ఇచ్చిన సీపీఐ రాబోయే ఎన్నికల్లో ఎవరితో కలిసి ఎన్నికల బరిలోకి దిగుతుందనే చర్చ జరుగుతోంది. ఈ తరుణంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చేసిన కామెంట్స్ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. తెలంగాణ పొత్తులపై పునరాలోచిస్తున్నామని, కర్నాటకలో 212 సెగ్మెంట్లలో తాము కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చామని చెప్పారు. దీనిపై ఈ నెల 18, 19 తేదీల్లో జరిగే సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నారాయణ వెల్లడించారు. దీంతో మొన్నటి వరకు బీఆర్ఎస్ తో చెట్టపట్టాలేసుకొని తిరిగిన సీపీఐ.. రూటు మార్చుకుంటుందా..? సీపీఐ కాంగ్రెస్ తో దోస్తీ కడుతుందా..? అనే చర్చ మొదలైంది.సీపీఐతో కలిసి పనిచేసే విషయంలో సీఎం కేసీఆర్ మౌనంగా ఉన్నారని, ప్రత్యామ్నాయాలు వెతకడానికి ముందు ఆయన స్పందన కోసం మరికొన్ని రోజులు వేచి చూస్తామని నారాయణ చెప్పారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ను గెలిపించేందుకు సీపీఐ తన సర్వశక్తులను ఒడ్డింది. ఆ సమయంలో రెండు బహిరంగ సభల్లో పాల్గొన్న సీఎం కేసీఆర్ బీజేపీని ఓడించేందుకు భవిష్యత్తులో కూడా కమ్యూనిస్టులతో కలిసి పనిచేస్తామని ప్రకటించారు. మునుగోడులో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ సైలెంట్ అయ్యారు.



## సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎంపీపీ..



ఎర్రుపాలెం వేం 15 సోమవారం (ప్రజాపాలన ప్రతినిధి):నేడు ఎర్రుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ఖమ్మం జిల్లా మరియు ఆంధ్ర రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా రెండు జిల్లాల స్థాయి సీఎం కప్పు సన్నాహక పోటీలను జాతీయ జెండా ఎగరవేసి క్రీడలను ఘనంగా ప్రారంభించిన యఎంపీపీ దేవరకొండ శిరీష,ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరిక ఆరోగ్యానికి ,ఎంతో దోహదపడతాయని చెప్పారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు ,ఎమ్మార్వో తిరుమల చారి,ఎస్ఐ సురేష్ ,గ్రామ సర్పంచ్ మొగిలి అప్పారావు, జడ్పిటిసి కవిత ,ఎంపీటీసీ షేక్ మస్తాన్వలి, సూపరిన్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి ,యూ డి సి వేణు, గురుకుల పాఠశాల ,మరియు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం,గ్రామ పంచాయతీ కార్యదర్శిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## శంకరపట్నంలో రైతుల రాస్తారోకో



శంకరపట్నం మే 15 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలో కేశవపట్నం మార్కెట్ యార్డు వద్ద సోమవారం రైతులు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసారు. స్థానిక మార్కెట్ యార్డ్ లో గత మూడు రోజులుగా ఎలాంటి దాన్యం కొనుగోలు నిర్వహించడం లేదనీ, మూడు రోజుల తర్వాత కనీసం సోమవారం ఐనా ధాన్యం తుకాలు, కొనుగోల్లు జరుగుతాయని ఆశించిన రైతులు సోమవారము కూడ కొనుగోల్లు, తూకాలు నిర్వహించలేదని ఆగ్రహంతో ఆందోళన వ్యక్తం చేస్తూ రాస్తారోకో చేసారు. దాన్యం తూకంలో కూడ ప్రబుత్వ నిబంధనకు మించి ఎక్కువ తూకం వేసి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, సిఈఓ, కొనుగోలు కేంద్రం ఇంచార్జిలు ఈ విషయాన్ని పట్టించుకోవట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్య తెలుసుకున్న స్థానిక తహసిల్దార్ వెంటనే స్పందించి రైతుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తూ, రైస్ మిల్లర్ల యజమానులతో ఫోన్లో మాట్లాడి రైతుల ఆందోళనను విరమింప చేశారు.

## శంకరపట్నంలో సీఎం కప్ క్రీడల పోటీలు ప్రారంభం



శంకరపట్నం మే 15 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి చీఫ్ మినిస్టర్ కప్ క్రీడా పోటీలను జెడ్పిటిసి లింగంపల్లి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ, క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, ఎమ్మార్వో గూడూరి శ్రీనివాసరావు, ఎంపీడీవో కాజా బషీరుద్దీన్, వైస్ ఎంపీపీ పులికోట రమేష్, వివిధ పాఠశాల పీఈటీలు హరికిషన్, శ్రీలత, జ్యోతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## కోట్లు విలువ చేసే భూమిని కాజేసిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ భర్త

### తమకు న్యాయం చేయాలంటూ స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితుల ఫిర్యాదు

చేవెళ్ల (ప్రజాపాలన ప్రతినిధి ):తమకు తెలువకుండా తమ భూమిని తమ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ భర్త,మా బంధువులు కలిసి అమ్మేశారనీ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండలం అలంఖాన్ గూడ




గ్రామానికి చెందిన ఎలిమెల్ల సుమతమ్మ (85) భర్త కీ.శే జంగారెడ్డి. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... సర్వేనెంబర్ 541/అ2/1 లో విస్తీర్ణం 1-21 గుంట గల భూమిని ధరణి లో మీకు ఏడు గుంటలే చూపిస్తుంది మిగతా భూమిని సరిచేసి పాసుబుక్ ఇప్పిస్తానని చెప్పి ఎమ్మార్వో ఆఫీస్ కి తీసుకెళ్లి మాతో సంతకాలు చేయించుకునీ మమ్మల్ని ఇంటికి పంపించాడన్నారు.రెండు మూడు రోజుల తర్వాత గ్రామంలోని కొంతమంది భూమిని ఎంతకు అమ్మారని అడగగా మేము భూమినే అమ్మ లేదు అని వారు దిగులు చెంది అదే గ్రామంలో ఉన్న వారి బంధువులకు ఈ విషయాన్ని చెప్పడంతో వారు అసలేం జరిగిందని ఆరా తీయగా గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త కైలా నరేందర్ రెడ్డి, బాధితుల బంధువులైన శ్రీనివాస్ రెడ్డి అతని కుమారుడు భూపతిరెడ్డిలు కలిసి బాధితుల కుమారుడు ఎల్లారెడ్డి తో కలిసి ఈ అన్యాయానికి పాల్పడ్డారని,బాధితులు 85సం,,గల ముసలమ్మ ఆమె కుమార్తె కు మతిస్థిమితం సరిగ్గా లేని మమ్మల్ని చూసి కోట్లు విలువ చేసే భూమికి తమ కొడుకుకు ఎంతో ఇంత ఇచ్చి మాకు మోసం చేశారని ఆవేదన చెందారు.వెంటనే మాకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# "వాయిస్ ఆఫ్ ద వాయిస్ లెస్" అన్నదే మాస్టర్ కీ ఛానల్ ఉద్దేశ్యం...

### బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారమే ఛానల్ ప్రథమ కర్తవ్యం

### స్నేహ క్లబ్, మాస్టర్ కీ ఛానల్ చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు








హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): వాయిస్ ఆఫ్ ద వాయిస్ లెస్... అనే ఉద్దేశంతో మాస్టర్ కి ఛానల్ ఆవిర్భవించిందని చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో బడుగు బలహీన వర్గాల సమస్యలను ప్రపంచానికి తెలియజేసేందుకు మాస్టర్ కీ ఛానల్ ను త్వరలో సాటిలైట్ ఛానల్ గా రూపాంతరం చెందనుందని ఆయన పేర్కొన్నారు. అన్యాయం ఎక్కడ జరిగిన నిర్భయంగా ప్రపంచానికి చూపించి, అసమానతలు తొలిగిపోవాలని, ప్రతి ఒక్కరూ ఫోర్త్ ఎస్టేట్ ను కింగ్ లాగా చూడాలనేది తన ఆలోచన అని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. మాస్టర్ కి టీవీ ఛానల్ జనరల్ బాడీ సమావేశాన్ని విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాస్టర్ కి ఛానల్ చైర్మన్ శివ భాగ్య రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులకి సొంతంగా ఒక టీవీ ఛానల్ ఉండాలని ఉద్దేశంతో మాస్టర్ కి ఛానల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చానల్స్ అన్ని రెండు పార్టీలకు మాత్రమే ఉన్నాయని, బహుజనుల కంటూ ఒక టీవీ ఛానల్ ఉండాలని ఉద్దేశంతో మాస్టర్ కీ ఛానల్ ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలోనే ఈ ఛానల్ ను సాటిలైట్ ఛానల్ గా మారుస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతి బహుజనుడిని ఓనర్ ను చేయాలనే ఉద్దేశంతో షేర్స్ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. తద్వారా వారు పెట్టే పెట్టుబడి రెట్టింపు అవ్వడంతో పాటు సంఘంలో పేరు ప్రతిష్టలు సంపాదించుకోవచ్చు అని వెల్లడించారు. ..

**మాస్టర్ కి టీవీ ఛానల్ జనరల్ బాడీ సమావేశానికి ప్రత్యేక అతిథిగా ప్రముఖ ఆడిటర్ ఆకుల చంద్రశేఖర్ మాట్లాడుతూ......**

ఎలక్ట్రానిక్ మీడియాలో కూడా షేర్లు కొనడం జరుగుచున్నది అని,జీటి.వి,సూర్య టి.వి, జెమిని టి.వి,ల షేర్స్ నేడు మార్కెట్ లో వేల కొట్ల రూపాయలు ఇన్వెస్ట్మెంట్ జరుగుచున్న విషయాన్ని ఉదాహరిస్తూ , మాస్టర్ కీ టీ.వి. షేర్స్ తీసుకోవటం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ప్రపంచంలో మీడియాలో వికేంద్రీకరణ విధానాన్ని తీసుకువచ్చిన ఏకైక వ్యక్తి శివ భాగ్య రావు అని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుండి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. స్నేహ టీవీ ఎండి శ్రీ కటికల క్రాంతి కుమార్ ,మాస్టర్ కి టీవీ కంటెంట్ ఓనర్ అల్లాడి పున్నారావు , మాస్టర్ కి టీవీ ఏపీ మీడియా ఇన్చార్జి గురజాల శ్రీనివాసరావు, స్నేహ క్లబ్ నేషనల్ ప్రెసిడెంట్ పీఎం రాజు మాస్టర్ కి టీవీ తెలంగాణ మీడియా ఇంచార్జ్ బూరాన్ ప్రభాకర్ , పార్స్ స్టేట్ కోఆర్డినేటర్ నమ్మి అప్పారావు, దాసరి విజయ ప్రకాష్ , ప్రసాద్ , జి. కెన్ని బాబు, కె.బి. రాజు, బి .అప్పారావు , పి.ఆర్ గాంధీ, యన్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

## పట్లూరులో సోమేశ్వర ఆలయంలో ధ్వజస్థంభం ప్రతిష్ఠాపన

### విశేష ప్రాధాన్యత కల సోమేశ్వర ఆలయం అభివృద్ధికి కృషి

### 51 వేలు విరాళం ప్రకటించిన సర్పంచ్ ఇందిర అశోక్



వికారాబాద్ బ్యూరో 15 మే ప్రజా పాలన : 100 సంవత్సరాల విశేష చరిత్ర కల సోమేశ్వర ఆలయం అభివృద్ధికి తన మన ధన రూపేణ సహకారమంద చేస్తున్న భక్తులందరికీ అభివందనాలని పట్లూరు గ్రామ సర్పంచ్ ఇందిర అశోక్ అన్నారు. సోమవారం మర్పల్లి మండల పరిధిలోని పట్లూరు గ్రామంలో సోమేశ్వర ఆలయంలో విగ్రహాలు ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పట్లూరు గ్రామ సర్పంచ్ ఇందిర అశోక్ మాట్లాడుతూ ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణమంతా ప్రతిధ్వనించాయని స్పష్టం చేశారు. ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా చూడముచ్చటగా జరిగిందని కొనియాడారు. పట్లూరు గ్రామ ప్రజలందరూ ఆధ్యాత్మిక చింతనతో తమ జీవితాలకు సార్థకతను చేకూర్చుకోవాలని ఆకాంక్షించారు. దైవచింతన కల ప్రతి వ్యక్తి మానసిక ప్రశాంతతను పొందుతాడని విశ్వాసం వ్యక్తం చేశారు. నేటి యాంత్రిక జీవన విధానంలో కనీసం ఒక గంట నైనా ఆధ్యాత్మిక చింతన వైపు దృష్టి సారిస్తే మంచి జరుగుతుందని అభిలషించారు. సోమేశ్వర ఆలయ నిర్మాణంలో ప్రతి పౌరుడు తమ వంతు ఆర్థిక సహాయ సహకారము అందజేయాలని కోరారు. ఆలయ నిర్మాణానికి నా వంతు సహకారంగా 51 వేల రూపాయలను అందజేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. భగవద్ అనుగ్రహము ఇలాగే కొనసాగితే ఆలయ నిర్మాణంలో తన వంతు ప్రత్యేక పాత్రను పోషిస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ మంజుల మహేష్, మాజి సర్పంచ్ టీ. సురేష్, రాకేష్, మాజి ఎంపీటీసీ రవి, మురళి సెట్, శ్రీశైలం, రాజు డీ. లక్ష్మి నారాయణ, పెద్దోళ్ల గోపాల్, ఒగ్గు నర్సిములు, అమర్, ఆలయ కమిటీ, ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరమర్శించిన టిఆర్ఎస్ నాయకురాలు జాదవ్ సుమన్ భాయి



జన్నారం, మే 15, ప్రజాపాలన: మండలంలోని పోనకల్ గ్రామానికి చెందిన దానరి మురళి గుండె పోటు రావడంతో మృతి చెందారు. సోమవారం భిఆర్ ఎస్ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నాయకురాలు జాదవ్ సుమన్ బాయ్ మరణించగా వారి నివాసానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా బదిత కుటుంబంను ఆదుకోని, సహకారం ఆదుకోవాలన్నారు, ప్రభుత్వం తరఫున భరోసా కనిపిస్తూ అందుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంతం శంకరయ్య, శ్రీనివాస్ మండల నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబీకులు, తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగను సన్మానించిన భరత్ వెంకట్ రెడ్డి దంపతులు మరియు టీవీ రెడ్డి



మధిర, ప్రజాపాలన ప్రతినిధి: మధిర నియోజకవర్గ పర్యటనకు వచ్చినటువంటి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగని మర్యాదపూర్వకంగా భరత్ విద్యాసంస్థల చైర్మన్, శ్రీమతి విద్యాలత వెంకటరెడ్డి ఆహ్వానం మేరకు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మందకృష్ణ మాదిగను ఘనంగా సన్మానించారు.

## ఎన్జీరంగావ్యవసాయ కళాశాలలో అదనపు గర్ల్స్ హాస్టల్ ను ప్రారంభించిన మంత్రి పువ్వాడ



అశ్వరావుపేట (ప్రజా పాలన ప్రతినిధి) అశ్వరావుపేట మండలంలోని స్థానిక ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల నందు అదనపు గర్ల్స్ హాస్టల్ ని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, వ్యవసాయ విద్యార్థులు అంటే దేశానికి వెన్నెముక లాంటి రైతులను ప్రోత్సహించడానికి ఉపయోగపడే విధంగా తయారు చేసేటువంటి అధికారులుగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తయారవ్వాలని అన్నారు.పెట్టే విద్యను మనం చేస్తున్నామని అన్నారు. అలాగే హాస్టల్లో మెనూని సక్రమంగా పెట్టాలని హాస్టల్ వార్డెన్ కి సూచనలు చేశారు మంచిగా మెనూ ప్రకారం పెడితేనే విద్యార్థులు తిని చదువుకుంటారని మంచి నాలెడ్జ్ పెరుగుతుందని ఈ సందర్భంగా ఆయన వార్డెన్ కి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా కలెక్టర్ అనుదీప్, ఎస్పి డాక్టర్ వినీత్ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జడ్పిటిసి చెన్నం శెట్టి వరలక్ష్మి వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర , నాయకులు రాజమోహన్ రెడ్డి బండి పుల్లారావు, సర్పంచ్ అడ్డం రమ్య, కలపాల శ్రీను, కాసాని చంద్రమోహన్ ,మోటూరి మోహన్, జుజ్జారపు రాంబాబు ,చెప్పనపల్లి శ్రీను, కళాశాల డి ఎస్ ఏ జెల్లా సత్యనారాయణ, గోపాల కృష్ణమూర్తి, ఐ వి ఎస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సైంటిస్ట్ రాంప్రసాద్, కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మధిర మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బంధం శ్రీనివాసరావు



బోనకల్, మే 15 ప్రజాపాలన ప్రతినిధి: మధిర మార్కెట్ కమిటీ బీసీకి రిజర్వ్ కావడంతో చైర్మన్‌గా బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బంధం శ్రీనివాసరావు నియామకం అయ్యారు. ఆయనతో పాటు నియోజకవర్గంలో మరో 9 మందిని పాలకవర్గం కమిటీ డైరెక్టర్లుగా నియమించనున్నారు. ఈ మేరకు మధిర మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ఫైల్ పై మార్కెటింగ్ అధికారులు సంతకాలు చేశారు. ఈ వారంలోనే నియామక ఉత్తర్వులు జారీ కానున్నట్లు మార్కెటింగ్ అధికారులు తెలిపారు. తొలిసారిగా బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బంధం శ్రీనివాసరావుకు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రావడంపై పలువురు మండల బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తన నియామకానికి సహకరించిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ కి, బీఆర్ఎస్ నాయకుల కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## అత్యంత వైభవోపేతంగా కొనసాగిన హనుమాన్ శోభాయాత్ర

మేడిపల్లి, మే15 (ప్రజాపాలన ప్రతినిధి): ఉప్పల్ చిలుకానగర్ గుట్ట





పైన నెలకొన్న శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవాలను గత మూడు రోజులుగా ఆలయ ధర్మకర్త, జిఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ గుడి స్వర్ణ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. ఇందులో ప్రధానంగా ఆదివారం రాత్రి శోభాయాత్ర అంగరంగ వైభవంగా ,కన్నుల పండువుగా భక్తుల కులాల మధ్య నిర్వహించారు. శోభ యాత్రలో వందలాదిమంది భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాలుపంచుకున్నారు. శ్రీ అభయాంజనేయ స్వామి ఆశీర్వాదంతో చిలుకానగర్ ప్రజల సహకారంతో ఎంతో వైభవంగా జరిగింది. హనుమాన్ మహా శోభ యాత్రకు ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పాల్గొన్నారు. ఘనంగా నిర్వహించడానికి సహకరించిన చిలుకా నగర్ ప్రజలకు భక్తులకు యూత్ సభ్యులకు, మహిళా మణులకు, ఆలయ కమిటీ మెంబర్స్ కు పేరుపేరునా ఆలయ ధర్మకర్త గుడి స్వర్ణ మధుసూదన్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## దేవుని రూపంలో మానవుల విగ్రహాలు నిషేధించాలి: భారత యాదవ సమితి



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):దేవుని రూపంలో మానవుల విగ్రహాలను నిషేధించాలని డిమాండ్ చేశారు భారత యాదవ సమితి నాయకుడు, మాజీ మంత్రి కృష్ణ యాదవ్.సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా లకారం చెరువు మధ్యలో శ్రీ కృష్ణుని రూపంలో ఎన్ టి ఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించండాన్ని భారత యాదవ సమితి తీవ్రంగా ఖండిస్తుంది అని తెలిపారు. దేవుని విగ్రహం రూపంలో రాజకీయ నాయకుడు, నటుడిని పెట్టడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఎన్ టి ఆర్ పై అభిమానం ఉంటే వేరేలా చూపించాలని దేవుడైన కృష్ణుడి రూపంలో విగ్రహం పెట్టడం సబబు కాదన్నారు. యాదవుల ఆరాధ్య దైవమైన కృష్ణుడి విగ్రహం రూపంలో పెట్టి తమ మనోభావాలు దెబ్బతీయొద్దన్నారు.తాను ఎన్ టి ఆర్ అభిమానినే నని, దేవుని రూపంలో మానవుల విగ్రహాలు నిషేధించాలని, ఎలాంటి అనుమతులు ఉన్నా ఆన్ లైన్ లో పెట్టాలన్నారు.సంబధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్క యాదవ సంఘం మాత్రమే కాకుండా శ్రీ కృష్ణుని భక్తులందరూ ఈ విగ్రహం ఆవిష్కరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.ఆదిభట్ల కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు కరాటే కళ్యాణి మాట్లాడుతూ ఇది అందరి సమస్య అని, సర్వంతర్యామి అయిన కృష్ణుడి రూపంలో ఒక రాజకీయ నాయకుడు, నటుడి విగ్రహం పెట్టడం సబబు కాదన్నారు. ఇది ఓట్లకోసం చేసే రాజకీయం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. మే 28 న విగ్రహం ఆవిష్కరణ నిలుపు చేయాలని లేకుంటే తాను ఆమరణ దీక్ష చేస్తానన్నారు. ఇకనుండి దేవుడి రూపంలో ఉండే మానవుల ఫోటో లను అనుమతించొద్దని అన్నారు. తాము ఎన్ టి ఆర్ అభిమానులమే అని ఐనా దేవుడు వేరు మానవుడు వేరు అన్నారు. పరమాత్మ రూపంలో మానవుడి విగ్రహాలకు అనుమతి ఇవ్వొద్దన్నారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఈ ఆలోచనను విరమించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణ యాదవ్,ఆదిభట్ల కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు కరాటే కళ్యాణి, భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నగేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధి రమేష్ యాదవ్, హరికృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షో రూంలో వివిధ ప్రాంతాల వివాహ బ్రైడల్ జ్యువెలరీ కలెక్షన్ల ఆవిష్కరణ



మేడిపల్లి, మే15 (ప్రజాపాలన ప్రతినిధి) :దేశంలోనే అతిపెద్ద బంగారు మరియు వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ డైమండ్స్, అత్యంత ప్రజాదరణ పొందిన తమ 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా ప్రచారంయొక్క 10వ ఎడి షన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ప్రముఖ బ్రాండ్ అంబాసిడర్లు అలియా భట్ మరియుఅనిల్ కపూర్ తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వధువులతో షోదవే అనే పేరుతో ఒక ప్రత్యేక థీమ్ సాంగును చిత్రీకరించారు. ఈ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 2023 థీమ్ సాంగ్ 3 నిమిషాల నిడివిలో చక్క ని వీడియోగా చిత్రీకరించబడింది. ఈ పాటను ప్రముఖ స్క్రిప్ట్ రైటర్ మరియు గీత రచయిత జూహీ చతుర్వే ది రాయగా, నిష్ణాతులైన సంగీత దర్శ కుడు కింగ్లుక్ చక్రవర్తి స్వ రపరిచారు. ఈ పాట మ్యూ జిక్ వీడియోను బాలీవుడ్ దర్శ కుడు కూకీ గులాటి చిత్రీకరిం చారు. క్రియేటివ్ ఏజెన్సీ రీడిఫ్యూ జన్ ఈ ప్రచారచిత్రాన్ని రూపొం దించారు.మూస పద్ధతులకు స్వస్తి పలుకుతూ ఆయా ప్రాంతాల సంప్రదాయాలు వారి హృదయానికి హత్తుకునేలా, దేశంలోని ప్రధాన ప్రాంతాల నుండి ఆధునిక తరానికి చెందిన వధువులను షో-రన్న ర్లు మరియు షో- స్టాపర్లుగా ఈ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 2023 థీమ్ వీడియో ప్రదర్శి స్తుంది, నేటి ఆధునిక యుగంలో స్త్రీలలో కనిపించే సాంగ్ ఆత్మ విశ్వా సం, శ్రద్ధ మరియు ఉ త్సా హాలను ప్రతిబింబిస్తూ, నవ వధువులను చూపించిన విధానం ప్రతి ఒక్క రూ అన్వ యించుకునేలా ఉంటుంది. ఈ వీడియోలో అలియా భట్ మరియు అనిల్ కపూర్, తమఅసమానమైన ఉనికి తోచేసిన ప్రదర్శ న ప్ర తి వధువు ఆ మధుర క్షణాలను సొంతం చేసుకోవాలనే భావనను తట్టిలేపుతుంది. బ్రై డ్స్ఆ ఇడియా2023 ప్రచారం ఈ థీమ్ సాంగుతో పాటు, అనేక రకాల బ్రైడల్ జ్యు వెలరీ లుక్స్ మరియు వివిధ ప్రాంతాలకు సంబంధించిన నిర్దిష్టమైన బ్రైడల్ జ్యు వెలరీ కలెక్షన్లను కూడా ప్రదర్శి స్తుంది. కాబోయే వధువులకు విస్తృత శ్రేణి బ్రైడల్ జ్యు వెలరీ కలెక్షన్ల నుండి వివిధ రకాల పెళ్లికూతురు అలంకరణలను అన్వే షించడంలో సహాయపడే లక్ష్యంతో బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 2023 ఇ- బ్రోచర్ మరియు డిజిటల్ లు క్స్ కూడా ప్రత్యేకంగా రూపొందించింది మలబార్ గోల్డ్ డైమండ్స్. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ మాట్లాడుతూ "ఈ తాజా ఎడిషన్లో, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా క్యాంపెయిన్ ఆధుని క వధువులలో ఒక ట్రెండ్సెట్ట ర్ ఉద్భవించింది అని తెలిపారు. బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 2023 థీమ్ సాంగ్ షో ద వే విడుదల చేయడం వారికి ఎంతో ఆనందంగా ఉంది అని చెప్పారు బ్రైడల్ జ్యువెలరీ ప్రచారానికి అన్ని కోణాల్లో ఇది ఉ పయోగపడుతుంది. ఎంతో సుందరంగా చిత్రీకరించబడిన ఈ అద్భుతమైన ప్రచారచిత్రం మలబార్ గోల్డ్ బ్రాండ్ అంబాసిడర్లు అలియా భట్ మరియఅనిల్ కపూర్ మరియు మంత్రముగ్ధులను చేసే మలబార్ ఆభరణాలు గోల్డ్ డైమండ్స్ ఆభరణాల ప్రపంచం, పారదర్శకత మరియు నాణ్యత హామీతో లభించే పెళ్లి. మొదలైనవన్నీ కలిగొలిపి వివాహ ఆభరణాల కొనుగోళ్లకు ఏకైక ప్రస్థానంగా మలబార్ గోల్డ్ డైమండ్స్ స్థానాన్ని సుస్థిరం చేస్తాయి అని అన్నారు బ్రైడ్స్ ఆఫ్ ఇండియా మాయాజాలాన్ని అనుభూతి చెందడానికి అందరినీ స్వాగతిస్తున్నాము." అన్నారు. బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 2023 థీమ్ సాంగ్ షో ద వే పూర్తి వెర్షన్ ఎంపిక చేసిన టీవీ ఛానళ్ళతో పాటు, వివిధ డిజిటల్ ప్లాట్ఫామ్స్ లో ప్రసారం చేయబడుతోంది. థీమ్ సాంగ్ యొక్క చిన్న వెర్షను టెలివిజన్ చానళ్ళు మరియు ఓ.టి.టి ప్లాట్ఫామ్స్ లో ప్రదర్శించబడతాయి అని తెలిపారు. పత్రికా ప్రకటనలు, హోర్డింగ్లు, రీల్స్, బ్రైడల్ లుక్-బుక్స్, కేటలాగులు, ప్రోడక్ట్ షాట్స్, వీడియోలు, ప్ర త్యేక మైక్రోసైట్ మరియుప్రముఖ సోషల్ మీడియాలతో మార్కెటింగ్ ప్రచారం ప్రారంభించబడింది అని తెలిపారు. ఆభరణాల మార్పిడిపై సున్నా శాతం తగ్గింపు అందిస్తుంది అని తెలిపారు మలబార్ గోల్డ్ %ం% డైమండ్స్. ప్రమాణాలతో 28- పాయింట్ల నాణ్యత తనిఖీ చేసిన వజ్రాలు అందిస్తుంది అన్నారు బైబ్యాక్ హామీ, బాధ్యతాయుతమైన మూలాల నుండి బంగారం సేకరించడం, న్యాయమైన కార్మిక విధానాలు పాటిస్తుంది అని తెలిపారు 'వన్ ఇండియా వన్ గోల్డ్ రేట్' పథకం కింద దేశ వ్యాప్తంగా ఒకే ధరలో బంగారుఆ భరణాలను అంది స్తోంది మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అని వారు తెలిపారు.

## నారాయణపూర్ లో చీఫ్ మినిస్టర్ కప్ క్రీడోత్సవము: సిఈఓ జానకి రెడ్డి





వికారాబాద్ బ్యూరో 15 మే ప్రజాపాలన : ప్రభుత్వ ఆదేశానుసారము మండల స్థాయిలో చీఫ్ మినిస్టర్ కప్ క్రీడోత్సవము నిర్వహించనున్నామని సిఈఓ జానకి రెడ్డి ఎంపిడిఓ మల్ల సత్తయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీఫ్ మినిస్టర్ కప్పు క్రీడోత్సవాన్ని 2023 మే16, 17 తేదీలలో మంగళ, బుధవారాలలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం నారాయణపూర్ లో నిర్వహించనున్నామని స్పష్టం చేశారు. ఈ క్రీడోత్సవంలో అథ్లెటిక్స్, ఫుట్బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అనే ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు.ప్రతి క్రీడా పోటీలో 15బి 36 సంవత్సరాల మధ్య గల యువతి యువకులు వేరువేరుగా పాల్గొనాలని సూచించారు. ప్రతి క్రీడలో యువతుల జట్లు, యువకుల జట్లకు వేరువేరుగా పోటీలు నిర్వహించబడతాయని వెల్లడించారు. ప్రతి క్రీడాంశంలో ప్రతి గ్రామము నుంచి విధిగా ఒక పురుషుల జట్టు, ఒక మహిళల జట్టు 15బి36 ఏళ్ల వయస్సున్న వారు పాల్గొనాలని అన్నారు. పాల్గొనే క్రీడాకారులు విధిగా ఆ గ్రామానికి చెందిన వారే అయి ఉండాలని షరతు విధించారు. దీనికోసం ఆధార్ కార్డు అడ్రస్ ని ప్రూఫ్ గా తీసుకుంటామని చెప్పారు. 8.తేదీ 16.5.2023 అనగా మంగళవారం రోజు ఉ దయం 9గంటలకు నారాయణపూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణంలో కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడాంశముల కు సంబంధించిన పోటీలు జరుగుతాయన్నారు. చీఫ్ మినిస్టర్ కప్పు క్రితం దోత్సవాలకు సంబంధించిన కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడా కోర్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఈఓ సుభాషిణి, ఎంపిఓ పడమటి నాగరాజు, ఎపిఎం లక్ష్మయ్య, ఎపిఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు రాములు, బండ కిషన్ రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నంలో రైతుల రాస్తారోకో



శంకరపట్నం మే 15 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలో కేశవపట్నం మార్కెట్ యార్డు వద్ద సోమవారం రైతులు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసారు. స్థానిక మార్కెట్ యార్డ్ లో గత మూడు రోజులుగా ఎలాంటి దాన్యం కొనుగోలు నిర్వహించడం లేదనీ, మూడు రోజుల తర్వాత కనీసం సోమవారం ఐనా ధాన్యం తుకాలు, కొనుగోల్లు జరుగుతాయని ఆశించిన రైతులు సోమవారము కూడ కొనుగోల్లు, తూకాలు నిర్వహించలేదని ఆగ్రహంతో ఆందోళన వ్యక్తం చేస్తూ రాస్తారోకో చేసారు. దాన్యం తూకంలో కూడ ప్రభుత్వ నిబంధనకు మించి ఎక్కువ తూకం వేసి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ కమిటీ చైర్మన్, సిఈఓ, కొనుగోలు కేంద్రం ఇంచార్జిలు ఈ విషయాన్ని పట్టించుకోవట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్య తెలుసుకున్న స్థానిక తహసిల్దార్ వెంటనే స్పందించి రైతుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తూ, రైస్ మిల్లర్ల యజమానులతో ఫోన్లో మాట్లాడి రైతుల ఆందోళనను విరమింప చేశారు.

## మా జీవితాలు నిలబెట్టండి.. జీతాలు ఇప్పించండి

### గోదావరి పాలిమర్స్ కార్మికుల గోడు



మేడిపల్లి, మే15 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి పారిశ్రామిక వాడలో ఉన్న గోదావరి పాలిమర్స్ ప్రైవేటు కంపెనీ కార్మికుల జీవితాలతో ఆడుకుంటోంది. గత రెండు సంవత్సరాలుగా కార్మికులను జీతాలివ్వకుండా రకరకాలుగా ఇబ్బందులు పెడుతోంది. ఈ కంపెనీలో సుమారు 86 మంది రెగ్యులర్ కార్మికులు,మరో 30 మంది క్యాజువల్ లేబర్ పని చేస్తున్నారు. వీళ్లందరికీ గత రెండు సంవత్సరాలుగా కంపెనీ సరిగ్గా జీతాలు ఇవ్వడం లేదు. గత 8 నెలలుగా జీతాలు ఇవ్వడం పూర్తిగా ఆపేశారు. పైగా గత ఫిబ్రవరి 8న లాకౌట్ చేశారు. యాజమాన్యానికి ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదు. జీతాలు ఇవ్వడం లేదు. కంపెనీ తెరవడం లేదు. గోదావరి పాలిమర్స్ కంపెనీ 1991లో స్థాపన జరిగింది. అప్పటి నుంచి కంపనీలో పనిచేస్తూ, కంపెనీ అభివృద్ధిలో కార్మికులు బాగస్వామ్యమయ్యారు. సుమారు 100 కోట్ల టర్నోవర్ కు చేర్చారు. కానీ కంపెనీ యాజమాన్యం కార్మికులపై కక్ష కట్టింది. ఇంత కాలం కంపెనీ మీదే ఆధారపడి కార్మికులు జీవిస్తున్నారు. ఎనమిది నెలలుగా జీతాలు లేకపోవడంతో కార్మికులకు కుటుంబాలు గడవడం కష్టతరంగా మారింది. ఇంటి కిరాయలు, పిల్లల ఫీజులు, తినడానికి తిండి లేక కుటుంబాలు పస్తులుంటున్నాయి. ఇలా అర్థాంతరంగా కార్మికులను రోడ్డున పడేయడం అన్యాయం. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

మంగళవారం 16, మే 2023

## రైతుల ఆత్మహత్యలకు అంతం లేదా ?

ప్రభుత్వ విధానాల మార్పులు రైతుల ఆత్మహత్యలను పెంచుతున్నాయి. ప్రభుత్వ రుణ సదుపాయం తగ్గిపోవడం, సహకార వ్యవస్థ పూర్తిగా మూతపడడం, ప్రస్తుత బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలు, విధానాలు, విద్యుత్ చట్టాలు రైతాంగాన్ని భూముల నుండి తరిమివేసేలా లేదా ఆత్మహత్యలను పెంచే విధంగా వున్నాయి. వీటికి తోడు ప్రకృతి వైపరీత్యాలు రైతులను ముంచేస్తున్నాయి. గత రెండు సంవత్సరాల్లో అధిక వర్షాల వల్ల రాష్ట్రంలోని 14 జిల్లాల్లో కోట్ల రూపాయల రైతుల పెట్టుబడులు మట్టిపాలు కావడం చూస్తూనే వున్నాం. దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు మరలా పెరుగుతున్నాయి. 2016 నుండి 2021 సంవత్సరాల మధ్య 64,222 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతుల్లో ఎక్కువమంది పేద, దిగువ మధ్యతరగతి, వ్యవసాయ కూలీలు. వీరిలో సామాజికంగా బలహీన వర్గాలకు చెందిన వారు అత్యధికం. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రచారాలు చేసుకుంటుండగా మరోవైపు రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఇది పాలకుల ప్రకటనలకు, ప్రజల అనుభవాలకు మధ్యనున్న అంతరానికి ఓ నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే గత ఆరేళ్లల్లో ప్రతి సంవత్సరం సగటున పది వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారిక రికార్డులకు ఎక్కని రైతుల ఆత్మహత్యలు ఇంతకు రెట్టింపు వుంటాయి. వ్యవసాయాధారిత దేశంలో ఇంతమంది అర్థాంతరంగా ఊపిరి తీసుకుంటుంటే పాలకులు సిగ్గు పడాల్సిందిపోయి నిబంధనల చాటున రైతుల ఆత్మహత్యలు రికార్డుల్లోకి ఎక్కకుండా అడ్డుకుంటున్నారు. వ్యవసాయం మీద మాత్రమే ఆధారపడి తమ కుటుంబాన్ని పోషించుకోగలమనే ధైర్యం ఏ రైతు కుటుంబంలోనూ లేదు. అందుకే తమ పిల్లలకు వ్యవసాయం వద్దని గ్రామీణ పెద్దలు చెబుతుంటే, వ్యవసాయ కుటుంబాలతో సంబంధం కలుపుకోవడానికి ఆడపిల్లల తల్లిదండ్రులు అయిష్టత చూపిస్తున్నారు. జాతీయ గణాంకాల శాఖ 2021 సెప్టెంబర్ 10న ప్రకటించిన నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం వ్యవసాయ సాగు ద్వారా రోజుకు రైతుకు వచ్చే సగటు ఆదాయం కేవలం రూ.27 కాగా, నెలకు రూ. 816.50 పైసలు. సగటున ఒక కుటుంబం పంటల సాగు ద్వారా రూ. 3,798 మాత్రమే పొందుతున్నది. 2013 సర్వే నుండి 2019 నాటికి రైతులు వ్యవసాయం మీద సగటున సంవత్సరానికి పొందుతున్న ఆదాయం రూ.6,442 నుండి రూ.10,218కి పెరిగినట్లు ఇది తమ ఘనత అయినట్లు బిజెపి నేతలు చెబుతున్నారు. వాస్తవంగా 2013లో ఒక రైతు కుటుంబం సాగు ద్వారా రూ. 3,081 సంపాదించగా 2012 ధరలతో పోలిస్తే ఈ ఆదాయం రూ. 2,770కి సమానం. 2019లో రైతు కుటుంబ సగటు ఆదాయం రూ.3,798 మాత్రమే. పంటల ఉత్పత్తి ద్వారా వచ్చే ఆదాయం 2013 నుండి 2019 నాటకి 5 శాతం పైగా తగ్గింది. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, విద్య, వైద్యం, ఇతర ఖర్చుల ధరలతో పోలిస్తే వాస్తవ ఆదాయం మరింతగా తగ్గిపోవడమే కాక తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోయారు. 2019 సర్వే ప్రకారం దేశంలోని 50 శాతం రైతాంగ కుటుంబాలకు సగటున రూ. 74,121 అప్పులు వున్నాయి. బ్యాంకులు వ్యవసాయ రుణాలు పెంచాల్సిన పరిస్థితి నుండి తీవ్రమైన పతనం వైపు సాగాయి. చిన్న, సన్నకారు రైతులకు బ్యాంకు రుణాలు అందకుండా చేయడంతో వడ్డీ వ్యాపారుల ధనదాహానికి రైతాంగం బలైపోయింది. 1990 నుండి 2011 మధ్య వ్యవసాయదారులకు ప్రత్యక్షంగా రూ. 20 వేల కన్నా తక్కువ వుండే బ్యాంకు రుణాలు 92 శాతం నుండి 48 శాతానికి తగ్గిపోగా ఇదే సమయంలో రూ.10 లక్షల కన్నా ఎక్కువ మొత్తంలో ఇచ్చే రుణాలు 4 శాతం నుండి 23 శాతానికి పెరిగాయి. పేద రైతులకు రుణ సదుపాయం కల్పించే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్)ను దెబ్బతీసే విధానాలను కేంద్ర ప్రభుత్వమూ, రిజర్వు బ్యాంకు చేపట్టాయి. దేశవ్యాప్తంగా 90 వేల సహకార సంఘాలు మూతపడే ప్రమాదం ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పేరుతో అమలు చేస్తున్న ఏ ఒక్క సంక్షేమ పథకం వాస్తవ సాగు సమస్యలను పరిష్కరించడంలేదు. కేంద్ర ప్రభుత్వ రైతు పథకాల్లో సాయిల్ హెల్త్ కార్డు పథకం, పరంపరాగత్ కృషి వికాస్ యోజన, ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన, నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్, ప్రధాన మంత్రి ఫసల్ బీమా, వడ్డీ రాయితీ పథకం ముఖ్యమైనవి. ఇవి కాకుండా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రైతు భరోసా, రైతు బంధు లాంటి అనేక పేర్లతో వివిధ పథకాల పేర్లతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నాయి. ఈ పథకాల వల్ల రైతుల పరిస్థితి మెరుగుపడకపోగా, మరింత దిగజారుతున్నది. స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ అభివృద్ధికి పాలకులు కొన్ని చర్యలు చేపట్టినా, ఈనాటికి రైతుల కోసం కొన్ని పథకాలు అమలు అవుతున్నాయన్నా అవి రైతుల మీద ప్రేమతోనో, రైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధితోనో చేపట్టినవి కావు. ప్రభుత్వాలను ఎన్నుకునే ఓటర్లలో అత్యధికమంది గ్రామీణ భారతంలో నివసిస్తూ వుండడం ఒక కారణమైతే, స్వాతంత్రోద్యమంలో రైతాంగ పోరాటాలు నిర్వహించిన పాత్ర మరో కారణం. స్వదేశీ పాలన ప్రారంభ కాలంలో దేశీయ ఆహార ధాన్యాల ఉత్పత్తి తక్కువగా వుండి విదేశాల మీద ఆధారపడే పరిస్థితి వుండడం కూడా రైతు పథకాలకు కారణం. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ప్రభుత్వ మద్దతు ధరలు–మార్కెటింగ్ వ్యవస్థ, బ్యాంకుల రుణ సదుపాయం, సహకార వ్యవస్థ, వ్యవసాయ పరిశోధనలు, అధిక దిగుబడి వంగడాల ఉత్పత్తి ఇవన్నీ పాలకుల అవసరాల కోసం చేపట్టిన విధానాల్లో భాగమే. 1991 నుండి అమలు చేసిన ప్రపంచీకరణ విధానాలు వ్యవసాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. సాంప్రదాయికంగా వాడే విత్తనాలు, ఎరువుల స్థానంలో బహుళజాతి కంపెనీలవి వాడాల్సిన పరిస్థితి అనివార్యమైంది. గ్రామీణ ప్రాంతంలో నివసిస్తూ, వ్యవసాయం మీద ఆధారపడిన 85 శాతం మందికి 2 ఎకరాల కన్నా తక్కువ భూమి వున్న పరిస్థితుల్లో ప్రభుత్వాలు చేపట్టే చర్యలేవైనా వీరిని ఆదుకునేలా వుండాలి. కాని మన పాలకులు (పార్టీలు ఏవైనా) అనుసరిస్తున్న విధానం వైరుధ్యాలతో కూడుకొని వుంది. చిన్న, సన్నకారు రైతులను విస్మరించి, ధనిక రైతాంగం, భూస్వామ్య ప్రయోజనాలకు అనుగుణంగా విధానాలు మారుతూ వచ్చాయి. ఇవి వ్యవసాయ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేశాయి. రైతులను ఆదుకోవడంలో కొంత మేరకు ఉపయోగపడిన జాతీయ ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ), మద్దతు ధరల ప్రకటన, రుణ సదుపాయం లాంటి అన్నింటిని సమూలంగా మార్చివేస్తున్నారు.గత మూడు దశాబ్దాల్లో వ్యవసాయ పెట్టుబడులు ఎన్నడూ లేనంత భారీగా పెరిగిపోయాయి. విత్తనాలు మొదలుకొని ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు, యంత్రాల వినియోగం పెరిగిపోయింది. నగదు చేతిలో వుంటే తప్ప వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇది సహజంగానే చిన్న, సన్నకారు రైతులకు గుదిబండగా మారింది. వ్యవసాయ సాగు భూములకు నీటి పారుదలను కల్పించాల్సిన ప్రభుత్వాలు క్రమంగా ఆ బాధ్యత నుండి తప్పుకున్నాయి. వర్షాధార సాగు రైతుల జీవితాలను కుంగదీసింది. దీనివల్ల బోర్లపై ఆధారపడటం ఎక్కువైంది. మెట్ట ప్రాంతాల్లో బోర్ల కింద సాగుచేయడం పెరిగింది.

# కర్ణాటక ఫలితాలు కనువిప్పు కలిగిస్తాయా ?



ప్రజల జీవన విధానాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసినట్టే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మెజార్టీ సాధించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను దాటి కాంగ్రెస్ పార్టీ 136 స్థానాల్లో విజయం సాధించింది. కేంద్ర బీజేపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చే విధంగా అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా కార్పొరేట్ శక్తుల చేతులలో బంది చేస్తున్న దుర్మార్గపు ప్రభుత్వం బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజలను మోసగించారు. ఉద్యోగాలు కల్పన, ఉపాధి భ్రాంతి గానే మిగిలిపోయింది. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం ఎంత మందికి చేశారు. నోట్ల రద్దు ద్వారా అవినీతి సొమ్మంతా ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి రూ. 15 లక్షలు అకౌంట్ లో వేస్తానన్న మోదీ ఇప్పటికీ ఎంతమంది అకౌంట్లలో రూ. 15 లక్షలు వేశారు. వచ్చే అన్ని రాష్ట్రాల శాసనసభ 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండ కట్టడానికి ఇప్పటి నుండి ప్రజలంతా ఏకం కావాలి. దేశంలో నిరుద్యోగం పెరిగి, ప్రజల ఆదాయ వనరులు తరుగుతున్నాయి. ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చు, కేటాయింపులు పడిపోతున్నాయి. రైతులు, ఇతర అన్ని తరగతుల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ప్రజల అప్పులు పెరుగుతున్నాయి. శత కోటీశ్వరుల అప్పులు రద్దు అవుతున్నాయి.వేళ్ళ మీద లెక్క పెట్టగలిగిన సంఖ్యలో ఉన్న కుబేరుల సంపద అంతులేకుండా పెరుగుతున్నది ఎవరి మద్దతుతో ఇలా జరుగుతున్నది అనే సత్యం ప్రజలు తెలుసుకుంటున్నారు. మోడీ ప్రభుత్వం రాఫెల్ కుంభకోణం రూ. 68 వేల కోట్ల విలువైన రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందంపై పెద్దఎత్తున అవినీతి, మనీ లాండరింగ్, ఆశ్రిత పక్షపాతం, అక్రమాలు, పన్నుల మాఫీల ద్వారా అనుచిత లబ్ధి వంటి ఆరోపణలు వెలువడ్డాయి. రక్షణ పరికరాల సమీకరణ పద్ధతి (డిపిపి) కింద 126 రాఫెల్ యుద్ధ విమానాలను సమకూర్చుకునేందుకు ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదిరింది. డసాల్ట్ నుండి హెచ్.ఎ.ఎల్ కు సాంకేతికతను బదిలీ చేసుకుని, దానితో వీటిలో 108 విమానాలను భారత్‌లో బెంగళూరుకు చెందిన హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్.ఎ.ఎల్) తయారుచేసి ఇచ్చేలా కూడా అంగీకారం కుదిరింది. ఒప్పందాన్ని కాదని ఆనాడు మోడీ తాజాగా ఒప్పందాన్ని ప్రకటించడం వివాదాస్పదమైంది. ప్రధాని మోడీ ఆనాడు ఫ్రాన్స్ పర్యటనలో ప్రకటించిన ఒప్పందంలో అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఏరో స్పేస్ భాగస్వామ్యాన్ని అకస్మాత్తుగా ప్రవేశపెట్టారు. ఏరోనాటిక్స్‌లో రిలయన్స్ కంపెనీకి అప్పటికి ఎలాంటి అనుభవం లేదు. పైగా రిలయన్స్ కంపెనీ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నది, ఇటువంటి ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా లేదు. డసాల్ట్ కు, ఏవియేషన్ రంగంలో ఎలాంటి అనుభవం లేని రిలయన్స్ ఏరో స్పేస్‌కు మధ్య అకస్మాత్తుగా ఒప్పందం కుదరడం, పైగా భారత్‌లో పాలక వర్గంతో అనిల్ అంబానీకి వున్న సాన్నిహిత్యాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఈ ఒప్పందం చుట్టూ అనేక ఆరోపణలు అలుముకుంటున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొన్ని బొగ్గు బ్లాకులను అభివృద్ధి చేసి, బొగ్గు తవ్వేందుకు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలకు లైసెన్సులు ఇచ్చింది. ఈ లైసెన్సుల జారీపై ఆరోపణలు రావడంతో సుప్రీంకోర్టు 2014లో వాటన్నింటినీ రద్దు చేసింది. అప్పుడే అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం, గనుల అభివృద్ధి, ఖనిజాన్ని వెలికితీయడానికి లైసెన్సులు జారీ చేసే అంశంపై 2015లో కొత్త చట్టం తెచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఛత్తీస్‌గఢ్‌లోని పర్సా, కంటా బొగ్గు బ్లాకుల లైసెన్సులు కూడా రద్దయ్యాయి. కానీ, వాటిల్లో బొగ్గు తవ్వుకొనేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం అదానీ గ్రూప్‌నకు అనుమతి ఇచ్చింది. ఆర్‌ఆర్‌బీయూఎన్‌ఎల్‌కు 25 శాతం వాటా దక్కగా, ఏఈఎల్‌కు ఏకంగా 75 శాతం వాటా దక్కింది. ఇది పూర్తిగా చట్టవిరుద్ధం. వాటాలు తల్లక్రిందులు కావటంతో ఈ జాయింట్ వెంచర్‌పై రాజస్థాన్ ప్రభుత్వానికి దక్కాల్సిన యాజమాన్య హక్కులు అదానీ గ్రూప్ చేతుల్లోకి వెళ్లిపోయాయి. కోల్ ఇండియా నిబంధనల ప్రకారం దేశంలోని థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో క్యాలరిఫిక్ విలువ 2,200 కిలోక్యాలరీల కనిష్ట స్థాయివరకు ఉన్న బొగ్గును కూడా వినియోగించవచ్చు. కానీ, ఆర్‌ఆర్‌బీయూఎన్‌ఎల్, ఏఈఎల్ మధ్య కుదిరిన ఒప్పందంలో ఈ విలువను ఏకంగా 4 వేల కిలో క్యాలరీలు పెంచేశారు. అంటే పర్సా, కంటా గనుల్లో తవ్విన బొగ్గులో క్యాలరిఫిక్ విలువ 4 వేల కిలోక్యాలరీలకంటే ఎక్కువ ఉన్న నాణ్యమైన బొగ్గునే వినియోగించాలి. అంతకంటే తక్కువ ఉన్న బొగ్గును ఆర్‌ఆర్‌బీయూఎన్‌ఎల్ తన ప్లాంట్లలో వినియోగించకుండా తిరస్కరించవచ్చు. ఈ ఒప్పందం వెనుక అదానీ గ్రూప్‌నకు ఆయాచిత ప్రయోజనం కల్పించే దురుద్దేశమే. ఆర్‌ఆర్‌బీయూఎన్‌ఎల్ తిరస్కరించిన బొగ్గులో 25 శాతాన్ని ఏఈఎల్ ఉచితంగా తీసుకొని వేరే పవర్‌ప్లాంట్లకు విక్రయించుకోవచ్చని జాయింట్ వెంచర్ నిబంధనల్లో పొందుపర్చారు. ఈ రెండు బ్లాకుల్లో వెయ్యి మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీయాలని ఈ కంపెనీల లక్ష్యం. అంటే మొత్తం బొగ్గులో 25 శాతం అంటే.. 250 మిలియన్ టన్నుల బొగ్గును అదానీ గ్రూప్ ఉచితంగా పొంది, తనకు ఇష్టం వచ్చిన కంపెనీలకు అమ్ముకోవచ్చు. దానివల్ల వచ్చే ఆదాయంలో పైసా కూడా ఆర్‌ఆర్‌బీయూఎన్‌ఎల్‌కు ఇవ్వాల్సిన పనిలేదు. అంటే అదానీ గ్రూప్ ఉచితంగా లభించే 25 శాతం బొగ్గుతోనే రూ.లక్ష కోట్లు సంపాదించుకొనే అవకాశం లభించింది. గతంలో గోదావరిఖని పర్యటనకు వచ్చిన సందర్భంగా సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేసే ప్రసక్తే లేదని ప్రకటించిన మోదీ నేడు వేలానికి సిద్ధమవుతున్నారు. దేశంలో ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు ప్రకంపనలు సృష్టిస్తోంది. అటు ఢిల్లీలో మొదలై ఇటు రెండు తెలుగు రాష్ట్రాలను ఓ ఊపు ఊపేస్తుంది ఈ కేసు. అందులో తన పాత్ర ఉందంటూ తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావటం, ఇప్పటికే వైసీపీ యంపీ విజయసాయి రెడ్డి అల్లుడు మరో ఎంపీ కుమారుడు మాగుంట రాఘవ, ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో సహా పలువురిని జైల్లో పెట్టారు. కవిత ఐదు విడతలుగా ఈడీ విచారణ హాజరుకావడం ఆసక్తికరంగా మారింది. దేశ రాజధాని అయిన ఢిల్లీలో మద్యం దుకాణాలు మొదట ప్రభుత్వ ఆధీనంలో ఉండేవి. వాటిని ప్రైవేటుకు అప్పగిస్తూ 2020 సెప్టెంబర్‌లో ఆప్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో పెద్ద స్కాం జరిగిందని అనుమానిస్తూ అసలు ఏం జరిగిందన్నది రూట్ లెవల్ నుంచి విచారణ చేయటం మొదలు పెట్టింది. పలువురు రాజకీయ, పారిశ్రామిక వేత్తలపై దాడులు నిర్వహించింది. లిక్కర్ స్కాంకు మూలాలు హైదరాబాద్‌లోనే ఉన్నట్టు సీబీఐ, ఈడీ వెల్లడించింది. పలుమార్లు దాడులు చేసి విచారణ జరిపి మనీశ్ సిసోడియా తో సహా మొత్తం 11 మందిని అధికారులు అరెస్ట్ చేశారు. మరోవైపు ఈ కేసులో కవితకు కూడా భాగస్వామ్యం ఉందన్న విషయాన్ని సీబీఐ, ఈడీ వెల్లడించింది. సౌత్ గ్రూప్ నుంచి రూ.100 కోట్ల ముడుపులు చేతులు మారినట్టు ఈడీ ఆరోపించింది. పన్నెండు సంవత్సరాల క్రిందట జన్ లోక్ పాల్ బిల్లు పెట్టడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రధాన భూమిక పోషించిన ప్రముఖ గాంధేయవాది అన్నా హజారే గారి ప్రియ శిష్యులే నేడు లిక్కర్ స్కాములో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. సామాన్య మదుపరుల ఆస్తులు లక్షల కోట్లు ఆవిరవుతున్న, ఎల్ఐసి, బ్యాంకింగ్ రంగం కుదేలవుతున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ప్రతిపక్షాలు పట్టుబట్టినా ప్రభుత్వం చలనం లేదు. భారత రెజ్లింగ్ సమాఖ్యలో లైంగిక వేధింపులు కలకలం రేపుతున్నాయి. మహిళా రెజ్లర్లపై అధ్యక్షుడితో పాటు ట్రెయినర్లు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని గత నెల రోజులుగా ఢిల్లీలో నిరసన తెలియచేస్తున్నారు. గతంలో వచ్చిన ఆరోపణలపై కమిటీ వేశారు. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. లైంగిక వేధింపుల ఆరోపణలపై కమిటీ తన నివేదికను సమర్పించడానికి ఎంత సమయం పడుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు అర్ధరాత్రి మద్యం తాగి పోలీసులు దాడి చేశారు. మహిళా రెజ్లర్ల పట్ల వ్యవహరించిన తీరు సభ్య సమాజం ఖండించాలి. ఇది నిజంగా సిగ్గుచేటు, బేటీ బచావో అనేది కేవలం ఓ బూటకం అని అర్థమైపోయింది . ఇటీవలి సంవత్సరాలలో, బిజెపి మతపరమైన ఉద్రిక్తతలను నిర్వహించడం, మానవ హక్కులు మరియు సామాజిక న్యాయ సమస్యల పట్ల దాని విధానం ఆర్థిక అభివృద్ధి తో సహా అనేక అంశాలలో విమర్శలను ఎదుర్కొంది. బిజెపి హిందూ జాతీయవాద ఎజెండాను ప్రోత్సహిస్తోంది, ఇది భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన లౌకిక బహువచన విలువలు బలహీనపరుస్తుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. మహిళలపై హింస వేధింపుల సంఘటనలుతో సహా మహిళల హక్కులకు సంబంధించిన సమస్యలపై పార్టీ విమర్శలను ఎదుర్కొంది. గత వారంలో పలు లైంగిక అకృత్యాలకు పాల్పడ్డ సీరియల్ రేపిస్ట్ ప్రవాస బీజేపీ అధ్యక్షుడు బాలేష్ ధంఖర్ ని ఆస్ట్రేలియా పోలీసులు అరెస్టు చేశారు. తన ఆస్ట్రేలియా పర్యటనలో ప్రధాని నరేంద్ర మోడీతో సన్నిహితంగా సంభాషించడానికి బాలేష్ ధంఖర్ అనుమతించ బడ్డాడు . 43 ఏళ్ల డేటా నిపుణుడు బాలేష్ ధంఖర్ తన ఇంట్లో ఐదుగురు కొరియన్ మహిళలకు మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేసినందుకు దోషిగా నిర్ధారించబడ్డాడు. అతను తన దాడులు, వీడియో సాక్ష్యాలను పరిశీలించినప్పుడు జ్యూరీ సభ్యులను మెలికలు పెట్టే చర్యలను కూడా రికార్డ్ చేశాడు, 2018లో, ధంఖర్ సిడ్నీ సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లోని తన స్టూడియో అపార్ట్‌మెంట్‌లో నలభై మంది మహిళలను అత్యాచారం చేసాడు. తనపై వచ్చిన 39 అభియోగాలలో ప్రతిదానిపై జ్యూరీ దోషిగా తీర్పులు ఇవ్వడానికి సహాయపడే వీడియోలు బహిర్గతం చేసింది. భారత రాజ్యాంగాన్ని దానిలో పొందుపరచబడిన స్వేచ్ఛను కించపరచడం గురించి పెద్దగా ఆలోచించరు పౌర నియమాలు నిబంధనలను ఉల్లంఘిస్తూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి తహతహలాడుతున్నారు. ఈ సమాంతర శక్తి యొక్క అనేక రకాలు, ఎటువంటి కార్యనిర్వాహక చట్టబద్ధమైన అధికారం లేకుండా, శిక్షార్హత లేకుండా వీధుల్లో పాలన సాగిస్తున్నాయి, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ని యం.పి గా అనర్హుడ్ని చేసి రాక్షసానందం పొందుతున్నారు. సామాన్య మదుపరుల డబ్బు లక్షల కోట్లు ఆవిరవుతున్న, దానికి కారణమైన అదానీ పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయకుండా కార్పొరేట్ ఎగవేతదారులకు రక్షణగా నిలుస్తున్నారు. భారత ప్రజాస్వామ్యం గత దశాబ్ద కాలంగా కల్లోల పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఇది నిస్సందేహంగా దేశంలోని మీడియాపై ప్రభావం చూపింది. మీడియా పరిస్థితి గురించి అర్థవంతమైన చర్చలు లేకపోవడం గత దశాబ్దంలో స్థిరమైన దృగ్విషయంగా మిగిలిపోయింది. మీడియా స్వేచ్ఛ పై పౌర సమాజం మౌనం వహించడం భారతదేశం వంటి ప్రజాస్వామ్యంలో మీడియా పోషించగల పాత్రను రాజీ చేసింది. మీడియా యొక్క రాజకీయ పక్షపాతం, స్వతంత్ర జర్నలిజం లేకపోవడం పౌర సమాజంలోని అనేక వర్గాల నుండి ఎటువంటి ప్రతిస్పందనను ఆకర్షించలేదు. కఠోర రాజకీయ పక్షపాతం, భూస్వామ్య, మతపరమైన శక్తులతో అనుబంధం సమకాలీన కాలంలో భారతదేశంలోని పౌర సమాజ స్వభావాన్ని నిర్వచిస్తుంది. దేశంలో మీడియా వంటి ప్రజాస్వామ్య సంస్థలు క్షీణించడం పట్ల పౌర సమాజం లోని వర్గాలు ఉదాసీనత చూపడం ఈ దౌర్భాగ్యానికి ప్రధాన కారణం గా భావించవచ్చు. బీజేపీ పెట్టిన అన్ని ప్రజా వ్యతిరేక బిల్లులకు తెలుగుదేశం, వైఎస్సార్సీపీ ప్రత్యక్ష మద్దతు తెలిపారు. అలాగే ప్రతిపక్షాల పై సీబీఐ, ఇడి దాడులు జరిగినప్పుడు, నాయకులపై చర్యలకు ఉపక్రమించినప్పుడు, బిజెపి నాయకులు లైంగికదాడులు చేసినప్పుడు, సామాజిక సమగ్రత లేకుండా ఒక వర్గంపై దాడులు చేసినప్పుడు తెలుగుదేశం, జనసేన, వైఎస్సార్సీపీ పరోక్ష మద్దతు తెలుపడం సిగ్గుచేటు. రాబోయే ఎన్నికల్లో విజ్ఞత కలిగిన ప్రజలు అవకాశవాద మతతత్వ పార్టీలకు బుద్ధి చెబుతారని ఆశిద్దాం.

**డా . యం. సురేష్ బాబు,**
**అధ్యక్షులు, ప్రజాసైన్స్ వేదిక.**

## ఇంటికే బీపీ, షుగర్ మందులు

హైదరాబాద్, మే 15, : తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది లేకుండా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ కిట్ల పంపిణీ చేయాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా దీర్ఘ కాలిక వ్యాధులైన బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు ఇంటి వద్దకే మందులు అందించనున్నారు. శుక్రవారం నుంచే హైదరాబాద్ జిల్లాలో ఈ విధానం అమల్లోకి వచ్చింది. రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆశా వర్కర్లు ఎన్‌సీడీ కిట్స్‌ను పంపిణీ చేయటం ప్రారంభించారు. ఈ విధానం ద్వారా దీర్ఘ కాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారికి ప్రభుత్వం నుంచి ఉపశమనం లభిస్తోంది. షుగరు..బీపీ వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధ పడుతున్న వారికి ఈ కిట్లు పంపిణీ కొనసాగుతోంది. ప్రతి కుటుంబంలో వయసు మీద పడిన వారికి దీర్ఘకాలిక సమస్యలైన బిపి, షుగర్ వంటి వ్యాధులు సర్వసాధారణంగా మారిపోయాయి. వీరంతా ప్రతినెనా మెడికల్ షాపులకి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ పరిస్థితుల నుంచి పేద ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం మెడికల్ కిట్లను అందజేస్తుంది. ఈ కిట్లలో బిపి, షుగర్ టాబ్లెట్లను ఉంచి వారికి కావలసిన టాబ్లెట్లను ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటికీ తిరిగి అందజేస్తుంది. నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ అంటే అసంక్రమిత వ్యాధి నివారణ అదుపునకు గాను ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా అధిక రక్తపోటు మధుమేహాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కిట్లను రూపొందించారు. బిపి, షుగర్ నియంత్రణతో లేకపోతే గుండెపోటు, పక్షవాతం, కంటి చూపు మందగించడం, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధులకు గురవడం, రక్తనాళాలు దెబ్బ తినడం, పాదాలకు పుండ్లు వంటి దుష్ప్రమైన పరిణామాలు బారిన పడే అవకాశం ఉంది. మందులను క్రమం తప్పకుండా వాడాలని సూచిస్తూ ప్రభుత్వం ఈ కిట్లను తయారు చేసింది. ఈ మందులను సులభంగా తీసుకెళ్లేందుకు వీలుగా, మందులను ఉంచుకునేందుకు వీలుగా.. చేతి సైజు బ్యాగులను రూపొందించారు. ఈ బ్యాగుల్లో బిపి, షుగర్ మందులను పెట్టుకోవడానికి వీలుగా కల్పిస్తుంది. ఈ బ్యాగులోనే బీపీ, షుగర్ మందులను పెట్టుకొని వాడుకోవలసి ఉంటుంది. ఒక్కో వ్యాధి గ్రస్తుడికి నెలకు సరిపడా మందులతో ఈ కిట్లను అందిస్తున్నారు. వీటితో పాటుగా త్వరలోనే న్యూట్రీషన్ కిట్లను సైతం అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గర్భిణుల డేటా సేకరణ, కిట్స్ పంపిణీ తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంలో నిమగ్నమయ్యారు.

# ఇక కాంగ్రెస్‌లో చేరికలు ఉంటాయా..?



హైదరాబాద్, మే 15,:కర్ణాటక ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ లో కొత్త ఉత్సాహం నింపుతున్నాయి. ఈ ఫలితాల తర్వాత తెలంగాణ బీజేపీకి జై కొడదామనుకున్న చాలా మంది నేతల అడుగులు కాంగ్రెస్ వైపు పడే అవకాశం కనిపిస్తోంది. అందరికంటే ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి సస్పెండైన జూపల్లి, పొంగులేటి వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. కర్ణాటక ఎన్నికలఫలితాల తర్వాత జూపల్లి, పొంగులేటి బీజేపీలో చేరాలని డిసైడ్ అయ్యారు. వారం క్రితం ఖమ్మంలో బీజేపీ నేతలు పొంగులేటితో సుదీర్ఘ చర్చల తర్వాత కాంగ్రెస్ లో చేరాలనుకున్న ఆలోచన విరమించుకుని ఇద్దరూ బీజేపీలో చేరేందుకు చర్చలు జరిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొంగులేటి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూపల్లి.. ఎవరికి వారే బాగా పట్టున్న నేతలుకావడంతో వారిద్దరినీ పార్టీలో చేర్చుకోవటం వల్ల వచ్చే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ నాయకత్వం చాలా ఆఫర్లు ఇచ్చినట్లుగా ప్రచారం జరిగింది. అయితే అప్పటికప్పుడు జెండా కప్పుకోకుండా కర్ణాటక ఎన్నికల ఫలితాల వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటామని ఈటల బృందానికి పొంగులేటి హామీ ఇచ్చారు. అయితే కర్ణాటక ఫలితాలు బీజేపీకి ఎంత షాకిచ్చాయో.. పొంగులేటి, జూపల్లి కి కూడా అంతే షాకిచ్చాయి. శనివారం ఫలితాలు వెల్లడయ్యాక జూపల్లి, పొంగులేటి ఫోన్లో సుదీర్ఘంగా చర్చించుకున్నారని... బీజేపీలో చేరే అంశాన్ని వాయిదా వేసుకున్నారని అంటున్నారు. ఫలితాల తర్వాత మాత్రం కాంగ్రెస్ వైపే పొంగులేటి అడుగులు కూడా పడుతున్నాయని సమాచారం. ఇదే బాటలో జూపల్లి కూడా నడవబోతున్నారని అంటున్నారు. కాంగ్రెస్‌కే జై కొట్టాలని ఇద్దర నేతల అనుచరులు కూడా పట్టుబడటంతో ఆ మేరకు తుది నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. వాస్తవానికి ఇంతకు ముందే ఇద్దరూ కాంగ్రెస్ జెండా కప్పుకోవాలి. ప్రియాంక గాంధీ హైదరాబాద్ పర్యటనలో కాంగ్రెస్ పార్టీలో చేరాల్సి ఉంది. అయితే అప్పట్లో బీజేపీ నేతలు వత్తిడి తీసుకురావడంతో ఆలోచన వాయిదా పడ్డప్పటికీ ఇక ఇదే ఫైనల్ డెసిషన్ అంటున్నారని అంటున్నారు. జూపల్లి, పొంగులేటి మాత్రమే కాదు బీజేపీలో చేరాలని చాలా మంది నేతలు ఉత్సాహపడుతున్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత చూద్దామని రాష్ట్ర నేతలు ఎప్పటి నుంచో వారందరికీ సర్ది చెబుతున్నారు. ఇప్పుడు వారంతా కాంగ్రెస్ లోకి క్యూ కట్టే అవకాశం ఉంది. బీజేపీని ఎలాగైనా నేతలతో నింపేయాలని చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. చేరికల కమిటీకి ఇంచార్జ్ గా ఉన్న ఈటల రాజేందర్ విసుగుపుట్టి రాజీనామాకు కూడా సిద్ధమయ్యారు. అయితే హైకమాండ్ పెద్దలు సర్ది చెప్పారు. కొంత కాలం ఆగాలన్నారు. ఇప్పుడు ఆయనకు ఇక ఎలాంటి చేరికలు ఉండే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పుడు జోష్ అంతా కాంగ్రెస్ లోనే కనిపిస్తోంది. కొంత కాలం పాటు బీజేపీ ఈ నిరాశలోనే ఉండనుంది.

**వాళ్లిద్దరికి క్లారిటీ వచ్చినట్టేనా..**

కర్ణాటక ఎన్నికల ఫలితాలతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కర్ణాటకలో కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కర్ణాటకలో అనూహ్యమైన విజయం సాధించడంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు, క్యాడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. కర్ణాటక ఎన్నికల ప్రభావం తెలంగాణ రాజకీయాలపై కొంత ప్రభావం చూపనుంది. మరో ఆరు నెలల్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తెలంగాణలోనూ కాంగ్రెస్ పుంజుకునే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ పరిణామంతో టీ కాంగ్రెస్ సభ్యత్వం కూడా పెరగనుంది. ఇతర పార్టీల్లోని అసంతృప్తి నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగానే ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు త్వరలో కాంగ్రెస్ లో చేరనున్నట్లు సమాచారం. కొంత కాలంగా ఏ పార్టీలో చేరాలనే దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోని జూపల్లి, పొంగులేటి కర్ణాటక ఎన్నికల ఫలితంతో దూకుడు పెంచారు. సేవ్ వనపర్తి పేరుతో ఆత్మీయ సమ్మేళనానికి జూపల్లి, పొంగులేటి హాజరయ్యారు. ఈ భేటీలో వీరిద్దరూ తమ భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తారని తెలుస్తోంది. కాంగ్రెస్‌లో చేరికపై ప్రకటన చేస్తారని అంటున్నారు. తెలంగాణ ఆవిర్భావ రోజైన జూన్ 2న తెలంగాణ కాంగ్రెస్ గూటికి చేరాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు పొంగులేటిని కలిసిన విషయం తెలిసిందే. బీజేపీలో చేరాలని పొంగులేటిని కోరారు. దీనిపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని పొంగులేటి కాషాయ నేతలకు చెప్పారు. ఖమ్మంలో బీజేపీ బలం లేని కారణంగా పొంగులేటి ఆ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. ఖమ్మంలో కాంగ్రెస్ బలంగా ఉండడం, కర్ణాటక విజయంతో రాష్ట్రంలో పుంజుకునే అవకాశం ఉండడంతో పొంగులేటి, జూపల్లి హస్తం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఇక పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్ పార్టీలో చేరితే కాంగ్రెస్ బలం పెరుగుతుంది. ఏది ఏమైనా ఎట్టకేలకు పొంగులేటి, జూపల్లి చేతులు కలుపుతున్నారనే వార్త రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది.

# మండే... సూరీడు...



హైదరాబాద్, మే 15, :తెలుగు రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రత్తలు ఠారెత్తిస్తున్నాయి. గత వారం వర్షాలతో జనం కాస్త ఉపశమనం పొందినా క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో జనం అల్లాడి పోతున్నారు. ఉక్కపోత, ఎండ వేడితో తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు అల్లాడిపోతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో జనం విలవిలలాడుతున్నారు. గత వారం బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. అకాల వర్షాలతో తీవ్రంగా పంట నష్టం జరిగింది. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన మోచా తుఫాను ప్రభావం ఏపీ, తెలంగాణలపై పెద్దగా ఉండదని వాతావరణ శాఖ తేల్చేసింది. తుఫాను ప్రభావం బంగ్లాదేశం, మయన్మార్ వైపు వెళుతోందని ప్రకటించింది. తెలంగాణలో ఉష్ణోగ్రతలు నాలుగైదు రోజులుగా క్రమంగా పెరుగుతున్నాయి. గురువారం పలు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిసినా, చాలా చోట్ల ఎండ అదరగొట్టేసింది. మరో నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత ఇలాగే ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సగానికిపైగా జిల్లాలకు ఆరెంజ్? అలర్ట్?ను జారీ చేసింది.ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, జయశంకర్?భూపాలపల్లి, జనగామ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, ఖమ్మం, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ, నాగర్?కర్నూల్, మహబూబ్?నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాలకు ఆరెంజ్? అలర్ట్?ను జారీ చేసింది. ఈ జిల్లాల్లో టెంపరేచర్లు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. వికారాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, ములుగు, నాగర్?కర్నూల్, గద్వాల, కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిశాయి. రాజేంద్రనగర్, కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో అత్యధికంగా 1.9 సెంటీ మీటర్ల వర్షం పడింది.కరీంనగర్? జిల్లా వీణవంక, జగిత్యాల జిల్లా జైనలో అత్యధికంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జయశంకర్?భూపాలపల్లి జిల్లా తాడిచర్లలో 44.1, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 43.8, ఆదిలాబాద్? జిల్లా చాప్రాలలో 43.3, నిర్మల్? జిల్లా బుట్టాపూర్?లో 42.8, కవ్వాల్? టైగర్? రిజర్వ్?లో 42.8 డిగ్రీల చొప్పున టెంపరేచర్లు నమోదయ్యాయి.రాబోయే మూడు రోజుల్లో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకులు తెలిపారు.ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరుగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం అత్యధికంగా అనంతపురం జిల్లా శెట్టూరులో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం 60 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది.మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన 'మోచా తుపాను ఆగ్నేయ బంగ్లాదేశ్, ఉత్తర మయన్మార్ మధ్యలో కాక్స్ బజార్ వద్ద మే 14న తీరం దాటే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తుపాను పోర్టుబ్లెయిర్‌కు నైరుతి దిశలో 510 కి.మీ. దూరంలో, కాక్స్‌బజార్ కు దక్షిణ నైరుతి దిశలో 1,190 కి.మీ. దూరంలో, మయన్మార్‌లోని సిత్త్వే కు దక్షిణ నైరుతి దిశలో 1,100 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందన్నారు.మోచా ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ గురువారం రాత్రికి తీవ్ర తుపానుగా మారుతుంది. ఉదయానికి మధ్య బంగాళాఖాతంలో అత్యంత తీవ్ర తుపానుగా బలపడుతుందన్నారు. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా 175 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందన్నారు.తుఫాను ముప్పు తప్పడంతో ఏపీలో వేసవి ఉష్ణోగ్రతలు కూడా గరిష్టంగా నమోదు కానున్నాయి. అనకాపల్లి జిల్లా గొలుగొండ, నర్సీపట్నం, నాతవరం, కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలో 60 మండలాల్లో వడగాల్పులు, శనివారం 32 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 194 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన చోట్ల ఎండ ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజలు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పీఆర్సీ చిచ్చు

హైదరాబాద్, మే 15, :తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల్లో స్తబ్దత నెలకొంది. గత మూడు, నాలుగు నెలలుగా ఉద్యోగులు తమకు న్యాయంగా రావాల్సిన పీఆర్సీ కోసం యాజమాన్యంపై ఉద్యమించారు. విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు కూడా సిద్ధమయ్యారు. ట్రాన్స్ కో, జెన్కో సీఎండీ ప్రభాకర్ రావుతో పలుమార్లు విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ జేఏసీ చర్చలు జరిపింది. 30 నుంచి 40 శాతం పీఆర్సీ ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు భీష్మించుకుని కూర్చున్నాయి. ప్రస్తుతం సంస్థ ఆర్థిక పరిస్థితి బాగోలేదని? పీఆర్సీ అంత ఇవ్వలేమని సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. అయితే ఉద్యోగులు, యాజమాన్యాన్ని కాదని ప్రభుత్వ పెద్దలను ఆశ్రయించారు. మంత్రి జగదీష్ రెడ్డితో చర్చలు జరిపారు. అక్కడ కూడా అలాంటి ప్రపోజల్ రావడంతో సమ్మెకు వెళ్తామని పీఆర్సీ జేఏసీ స్పష్టం చేసింది. ఉద్యోగులు సమ్మెకు వెళ్ళొద్దని యాజమాన్యం ఆదేశించింది. ఈ విషయంలో సీఎండీ ప్రభాకర్ రావు, యూనియన్ నేతల మధ్య తీవ్ర స్థాయిలో భేదాభిప్రాయాలు ఏర్పడ్డట్లు సమాచారం. ముఖ్యమంత్రి కూడా సీఎండీ ప్రభాకర్ రావు పై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. ఉద్యోగుల పీఆర్సీ అంశాన్ని ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంబించారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విద్యుత్ సౌధలో ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అయితే చివరికి యాజమాన్యం చెప్పిన 7 శాతం పిఆర్సీతో పాటు పలు ఆర్థిక పరమైన అంశాలకు జేసీ నేతలు సమ్మతించారు. ఇదిలావుంటే, ఆర్టిజెన్స్ కూడా సమస్యలను పరిష్కరించాలని సమ్మెకు పిలుపునిచ్చారు. యాజమాన్యం వద్దని వారించినా వెనక్కి తగ్గలేదు. మూడు రోజుల పాటు సమ్మెకు దిగారు. సమ్మె విషయంలో ట్రాన్స్ కో, జెన్కో సీఎండీతో పాటు ఎన్పిడిసియెల్, ఎస్పిడిసియెల్ సీఎండీలు సైతం ఉద్యోగ సంఘాలపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. అయినా కార్మిక సంఘాల నేతలు బలవంతంగా కార్మికులతో సమ్మె చేయించారు. ఎస్మా ప్రయోగించి సుమారు 300 మంది కార్మికులను విధుల్లో నుంచి తొలగించింది యాజమాన్యం. ఇప్పుడు ఆ కార్మికులు రోజూ సీఎండీల కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి ఏర్పడింది. యాజమాన్యం మిగతా కార్మికులపై చర్యలు తీసుకోబోమని స్పష్టం చేసింది. ఉద్యోగాలు కోల్పోయిన వారు తమను క్షమించండి అని వేడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో సమ్మె ముగిసింది. యాజమాన్యం, అధికారులు, ఉద్యోగులు, కార్మికుల మధ్య గ్యాప్ పెరిగింది.గతంలో విద్యుత్ ఉద్యోగుల విభజన ఉద్యోగ సంఘాల నేతలకు, యాజమాన్యంకు మధ్య గ్యాప్ తెచ్చింది. యాజమాన్యం పై యూనియన్ నేతల మితిమీరిన వ్యాఖ్యలకు సీఎండీ నొచ్చుకున్నారు. తెలంగాణ ఉద్యోగులు తెలంగాణలో, ఆంధ్ర ఉద్యోగులు ఆంధ్రలోనే పని చేయాలి? తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు ప్రమోషన్స్ ఇవ్వాలనే డిమాండ్ అప్పట్లో తెరమీదకు తెచ్చారు. అప్పటికే ఆ యూనియన్లపై ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గర మంచి అభిప్రాయం ఉండటంతో సీఎండీ కూడా ఆ యూనియన్ నేతల మాటకు విలువిస్తూ వచ్చారు. ఒకానొక దశలో విభజన సమస్యల పై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో సీఎండీ ప్రభాకర్ రావు తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు అన్యాయం జరిగే సహించేది లేదని ఖరాకండిగా చెప్పిన పరిస్థితి. అయితే ఇలా సంవత్సరాలు గడిచాయి. ఉద్యోగుల విభజన సమస్యల పై విద్యుత్ యాజమాన్యాలు, ఇంజినీర్స్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం జస్టిస్ ధర్మాధికారి కమిటీని నియమించింది. చివరకు ధర్మాధికారి కమిటీ తుది తీర్పు కూడా వెల్లడించింది. తెలంగాణ ఇంజినీర్స్, యాజమాన్యాలకు వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది. ఇన్ని సంవత్సరాల్లో ఉద్యోగ సంఘాలు, యాజమాన్యం కలిసి సుమారు వంద కోట్ల రూపాయలు కోర్టు పనుల కోసం ఖర్చు చేశాయి. ఇంత చేస్తే ఇంజినీర్స్ కు న్యాయం జరిగాక పోగా? వందలాది మంది ఏపీ ఉద్యోగులు తెలంగాణకు కేటాయించారు. నిజానికి వారికి గడిచిన ఆరేళ్లుగా కూర్చో బెట్టి లక్షల జీతాలు చెల్లించాయి తెలంగాణ విద్యుత్ సంస్థలు.జస్టిస్ ధర్మాధికారి తుది తీర్పు తరువాత తెలంగాణ ట్రాన్స్ కో, జెన్కో సీఎండీ ప్రభాకర్ రావు ఆ యూనియన్ నేతల మాయ నుంచి బయటకు వచ్చారని తెలుస్తోంది. ఉద్యోగుల విభజన విషయంలో కోర్టు తీర్పు ఇచ్చిన తరువాత సదరు యూనియన్లు విద్యుత్ సౌధాలో ఒక సమావేశం ఏర్పాటు చేసి విద్యుత్ సంస్థల యాజమాన్యం, సీఎండీలు, డైరెక్టర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో సీఎండీ ఉద్యోగ సంఘాల నేతల వ్యాఖ్యలపై నొచ్చుకుని వారిని దూరం పెట్టారు. తాజాగా మళ్ళీ అదే పరిస్థితి విద్యుత్ సంస్థల్లో నెలకొంది. యూనియన్లు, సీఎండీలను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సీఎండీలు ఆ పదవులకు అనర్హులని ఉద్యోగ సంఘాల నేతలు తేల్చి చెబుతున్నారు. 60 ఏళ్లకు పదవీ విరమణ చేసిన వారిని 75 ఏళ్ళు వచ్చినా ఇంకా పదవుల్లో కొనసాగిస్తే ఇలాంటి సమస్యలే వస్తాయని వాపోతున్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోక పోవడం వల్ల సంస్థకే నష్టం వాటిల్లుతుందని నీతి సూత్రాలు చెబుతున్నాయి. విద్యుత్ సంస్థల్లో జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# పాడుబడ్డ ఇండ్లు విషపురుగులకు ఆవాసం

## పట్టణ ప్రగతి పనులలో నిర్లక్ష్యం

## కొట్టంగుట్ట, జాంబపూర్ తండాలలోనే రేషన్ బియ్యం ఇవ్వాలి

## 11వ వార్డు అభివృద్ధికి 10 లక్షలు మంజూరు

## కొట్టంగుట్ట జాంబపూర్ గిరిగెట్ పల్లి లో మీతో నేను

## వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్





వికారాబాద్ బ్యూరో 15 మే ప్రజాపాలన : మిషన్ భగీరథ నీటి పైపుల లీకేజీ సమస్యలను పరిష్కరించాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు. పైపులైన్ లీకేజీతో మి.భ.నీరు దుర్గంధం వస్తున్నందున తాగడం లేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సోమవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని 11వ వార్డుకు సంబంధించిన కొట్టంగుట్ట తండా, జాంబపూర్ తండా, గిరిగెట్ పల్లిలో వార్డు కౌన్సిలర్ చండిప్ప అనిత అనంతయ్య ఆధ్వర్యంలో ప్రతి గల్లీ తిరిగి క్షేత్రస్థాయిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ ట్యాంకు నింపుడల్లా బ్లీచింగ్ పౌడర్ వేయాలని నీటి సరఫరా సిబ్బందికి సూచించారు. క్యాస్ట్ ఇంకమ్ సర్టిఫికెట్ లను రెండు రోజుల్లో ఇవ్వాలని ఎంఆర్ఓ కు తెలిపారు. 11వ వార్డులో అండర్ డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం సమస్య అత్యంత ఆవశ్యకతను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పాడుబడిన ఇండ్లను తొలగించకపోవడంతో పాములు తేళ్లకు ఆవాస కేంద్రాలుగా మారాయని సమీప ఇండ్ల ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. చెత్తబండి 5, 6 రోజులకు ఒక్కసారి వస్తుందని గ్రామస్థుడు రవి ఆగ్రహంగా ఎమ్మెల్యే కు చెప్పారు. స్మశానవాటికకు నిర్దిష్టమైన జాగ చూపించాలని కోరారు. పట్టణ పరిధిలో ఉన్నా డిగ్రీ చేసిన వారు 50 మంది కూడా లేరని గ్రామస్థుడు రవి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. విద్యా బోధన సక్రమంగా చేయట్లేదని ఆరోపించారు. వర్షాకాలంలో రైల్వే బ్రిడ్జి కింద రాకపోకలకు కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సభాముఖంగా తెలిపారు. జాంబపూర్ తండాలో స్మశానవాటిక నిర్మాణం చేయాలని తండావాసులు కోరారు. పోడుభూముల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కొట్టంగుట్ట తండా జాంబపూర్ తండాలలోనే రేషన్ బియ్యం ఇప్పించాలని ఎమ్మెల్యే ను కోరారు. విద్యుత్ సమస్యలు చాలా ఉన్నాయని వార్డు ప్రజలు చెప్పారు. అండర్ డ్రైనేజీ సిసి రోడ్ల నిర్మాణం చేయాలని వాడు ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. 11వ వార్డుకు రైతుబంధు కింద 6.16 కోట్లు, రైతుబీమా కింద 60 లక్షల రూపాయలు వచ్చినవని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ చిట్యాల అనంత్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ మేక చంద్రశేఖర్ రెడ్డి, అనంతయ్య, పాండు, రెడ్యానాయక్, మునిసిపల్ కమీషనర్ శరత్ చంద్ర, పిట్టల రఘు శ్రీశైలం బర్ల రాంచంద్రయ్య శ్రీనివాస్ రెడ్డి భరత్ అంజయ్య కిష్టయ్య గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల ఏర్పాటుతో యువతకు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

## రాష్ట్ర ఐ.టీ, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు

## కొంగరకలాన్ లో ఫాక్స్ కాన్ కంపెనీ ఏర్పాటుకు అట్టహాసంగా భూమిపూజ



ఇబ్రహింపట్నం మే తేది 15 ప్రజాపాలన ప్రతినిధి :రంగారెడ్డి, మే 15 : తెలంగాణ యువతకు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కోసం విశేషంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐ.టీ, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ లో ఫాక్స్ కాన్ టెక్నాలజీస్ ప్లాంట్ ఏర్పాటు కోసం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎం.కిషన్ రెడ్డి, కలెక్టర్ హరీష్, ఫాక్స్ కాన్ టెక్నాలజీస్ కంపెనీ సీ.ఈ.ఓ యాంగ్ లియు తదితరులతో కలిసి మంత్రి కేటీఆర్ సోమవారం అట్టహాసంగా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఫాక్స్ కాన్ కంపెనీ ఏర్పాటు అవుతుండడం చారిత్రాత్మక సందర్భమని హర్షం వెలిబుచ్చారు. మొదటి దశలోనే రూ. 4 వేల కోట్ల పెట్టుబడితో, 200 ఎకరాల విస్తీర్ణంలో ఫాక్స్ కాన్ ప్లాంట్ ను నెలకొల్పడం వాళ్ళ 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. కేవలం రెండున్నర నెలల వ్యవధిలోనే అన్ని అనుమతులను పూర్తి చేసుకుని కంపెనీ ఏర్పాటు కోసం భూమి పూజ చేసుకోవడం జరుగుతోందని, ఇంత వేగంగా, సమర్థతతో పని జరగడం తావెక్కడా చూడలేదని ఫాక్స్ కాన్ కంపెనీ చైర్మన్ పేర్కొనడం ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనా దక్షతకు, తెలంగాణ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో కొత్త పుంతలు తొక్కుతూ యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ సహా ఇతర అనేక అంశాల ప్రాతిపదికన తెలంగాణకు జాతీయ స్థాయిలో వరుస అవార్డులు వరిస్తుండడం కేసీఆర్ ప్రభుత్వ దార్శనిక పాలనకు నిదర్శనమని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏ ప్రభుత్వానికైనా ఉద్యోగాలు కల్పించడం, సంపదను సృష్టిస్తూ అన్ని వర్గాల వారికి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం సవాలుగా మారిందన్నారు. అందరికీ ప్రభుత్వ కొలువులు ఇవ్వడం ఎవరికీ సాధ్యం కాదని, 140 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం సాయుధ దళాలు సహా అన్ని రంగాలను కలుపుకుని 60 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇవ్వగల్గుతోందని తెలిపారు. దేశ జనాభాలో ఇది 0 . 5 శాతం మాత్రమేనని అన్నారు. నాలుగు కోట్ల జనాభా కలిగిన తెలంగాణ రాష్ట్రంలో రెండు శాతానికి పైగా ఆరు లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని వివరించారు. మిగతా కోటీ యాభై లక్షల మంది యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ప్రైవేట్ రంగంలో భారీగా పెట్టుబడులు సాధించేందుకు ఇతోధికంగా కృషి చేస్తున్నామని అన్నారు. తద్వారా ఉద్యోగ, ఉపాధి కల్పనతో పాటు అపారమైన సంపద సృష్టించబడుతుందని, సంక్షేమాభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటవుతున్న ఫాక్స్ కాన్ కంపెనీ వల్ల ప్రత్యక్షంగా 35 వేల మందికి, పరోక్షంగా లక్ష పైచిలుకు మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఫాక్స్ కాన్ ప్లాంట్ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయి ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. కష్టపడి తెస్తున్న కంపెనీలను కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులపై ఎంతైనా ఉందని ఈ సందర్భంగా హితవు పలికిన మంత్రి కేటీఆర్, స్థానికులకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు లభించేలా కృషి చేయాలని సూచించారు. మరో తొమ్మిది నెలల వ్యవధిలో ఫాక్స్ కాన్ కంపెనీ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేయనున్న నేపథ్యంలో, ఆలోపు స్థానిక నిరుద్యోగ యువతీ,యువకులకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ ప్లాంట్ ప్రారంభం అయ్యే నాటికి వారు ఉద్యోగాలకు అన్ని విధాలుగా అర్హత సాధించేలా చొరవ చూపాలని హితవు పలికారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, ఫాక్స్ కాన్ సంస్థ ఉత్పత్తి కార్యక్రమాలకు రంగారెడ్డి జిల్లాను ఎంపిక చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృతజ్ఞతలు ప్రకటించారు. నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను రప్పించడంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు అహరహం శ్రమిస్తూ అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఆకట్టుకోవడంలో సఫలీకృతులవుతున్నారని కొనియాడారు. తెలంగాణ పట్ల నిబద్దత, పరిపూర్ణమైన అవగాహనతో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ రాష్ట్రాన్ని ఉన్నత స్థాయిలో నిలుపుతున్నారని అన్నారు. స్థానికంగా ఫాక్స్ కాన్ సంస్థ తన ఉత్పత్తులను ప్రారంభించనుండడం ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశంలోకి వచ్చిన అతి పెద్ద పెట్టుబడుల్లో ఇది అత్యంత కీలకమైనదని మంత్రి అన్నారు. ఈ సంస్థ పూర్తి స్థాయిలో తన ఉత్పత్తులను ప్రారంభిస్తే లక్ష మందికి పైగా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆకాంక్ష మేరకు ఫాక్స్ కాన్ కంపెనీ లో స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించేలా కృషి చేస్తామన్నారు. ఒక్కోటిగా వచ్చి చేరుతున్న పరిశ్రమలతో ఈ ప్రాంతం హైటెక్ సిటీని తలదన్నే రీతిలో అభివృద్ధి దిశగా వడివడిగా ముందుకు సాగుతోందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంత ప్రజలు తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం భూములను అమ్ముకోకుండా వాటిని కాపుడుకోవాలని, పరిశ్రమల స్థాపనతో భూముల ధరలు గణనీయంగా పెరగనున్నాయని మంత్రి సబితా ఇంద్రారెడ్డి హితవు పలికారు. జిల్లాలో 64 వేల కోట్ల పెట్టుబడి లక్ష్యంతో 20,000 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఫార్మాసిటీలో పూర్తిస్థాయిలో పరిశ్రమలు ఏర్పాటైతే 5.60 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు కిషన్ రెడ్డి అధ్యక్షత వహించగా, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అనితా హరినాథ్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చంద్, డీ సీ సీ బీ చైర్మన్ మనోహర్ రెడ్డి, డీ సీ ఎం ఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిని గ్రామ పంచాయతీగా చేయాలి



మంచిర్యాల టౌన్, మే 15, ప్రజాపాలన: మందమర్రిని ఇది వరకు ఉన్న విధంగా గ్రామ పంచాయతీ ని చేయాలని సోమవారం రోజు ఊరు మందమర్రి, నార్లపూర్, ఊరు రామకృష్ణాపూర్ గ్రామస్తులు మంచిర్యాల జిల్లా కలెక్టరు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించినటువంటి ఏజెన్సీ ప్రాంత హక్కులను పరి రక్షించుకోవడానికి మూడు గ్రామాల వాసులమైన ఊరు మందమర్రి, నార్లపూర్ ఊరు రామకృష్ణాపూర్ నివాసులు అందరు కలిసి ఇది వరకు ఏదైతే మందమర్రి గ్రామ పంచాయతీ ఉండేనో అదే విధంగా తిరిగి మళ్లీ మందమర్రిని గ్రామ పంచాయతీ గా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదనీ మా చట్టాలను రక్షించుకోవాలనే ఉద్దేశంలో భాగంగా మాత్రమే మందమర్రి గ్రామ పంచాయతీ చేయాలని కోరుకుంటున్నాం అని అన్నారు. మందమర్రిని గ్రామ పంచాయతీ గా చేసే వరకు నిరంతరం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు ఉధృతం చేస్తామని మందమర్రిని గ్రామ పంచాయతీ చేసిన తర్వాతనే ఎలక్షన్లు జరిపించుకోవాలని లేని పక్షంలో ఊరుకునే ప్రసక్తే లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులూ మేసినేని అరుణ్ కుమార్ పాలమాకుల భీమ్సేన్ ఎండి ముజాహిద్ భూనేని కిషోర్ కుమార్ కూన సత్యం సేనేని ప్రదీప్ గుండం శ్రీరామ్ సాగే శ్రీనివాస్ భైరనేని సత్యనారాయణ భూనేని కిషన్ రెడ్డి ఆకాష్ బైర్నేని హరి మేసినేని మల్లేష్ సెనేని మల్లేష్ నాగుల కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని కలెక్టర్ తో మాట్లాడిన భట్టి

### స్పందించిన కలెక్టర్ వెంటనే కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తామని హామీ




బోనకల్ మే 15 ప్రజాపాలన ప్రతినిధి: పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్న సిఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ని రావినూతల సొసైటీ అధ్యక్షులు వైనేనీ నారాయణ, గ్రామ శాఖ అధ్యక్షులు వట్టికొండ రామకృష్ణ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భద్రునాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు రావినూతల గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని వారి దృష్టికి తీసుకువెళ్లారు. పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్కవెంటనే జిల్లా కలెక్టర్ గౌతమ్ తో ఫోన్ ద్వారా మాట్లాడారు. భట్టి విక్రమార్క తో సంభాసించిన కలెక్టర్ గౌతమ్ స్పందించి రావినూతల్లో కొనుగోలు కేంద్రం ప్రారంభించినున్నట్లు తెలియజేయడంతో భట్టి విక్రమార్క ని కలిసిన రావినూతల నాయకులు వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

## సమస్యల పరిష్కారానికి దిక్సూచి ప్రజావాణి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి





వికారాబాద్ బ్యూరో 15 మే ప్రజాపాలన :ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరములో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుండి 212 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసాలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కి వస్తున్న ప్రతి ఒక్కరి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను శాఖల వారీగా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా గ్రూప్ -3, గ్రూప్ - 4 స్టడీ మెటీరియల్ ను పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్ తో కలిసి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అధికారులు పాల్గొన్నారు.

## ఎండ వేడికి వరి కోత మిషన్‌లో మంటలు



జన్నారం, మే 15, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో భానుడి ఉగ్ర రూపానికి రాంపూర్ గ్రామ సమీపంలో ఎండ వేడికి హార్వెస్టర్లులో మంటలు చెలరేగాయి. సోమవారం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సగ్గడి నరసయ్య పొలంలో వరికోత మిషన్ లో ఎండ వేడి కి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద స్థలంలో ఎవరికి అపాయము జరగ లేదు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వరి చేనులోకి చేరుకుని మంటలు ఆర్పారు. వరి కోత మిషన్ గుడి రేవు గ్రామానికి చెందినది, ప్రమాదంలో హార్వెస్టర్ రెండు లక్షల నష్టం వాటిల్లని వరి కోత మిషన్ యజమాని అన్నారు. అదేవిధంగా రాంపూర్ గ్రామంలో కంది గంగారం అనే రైతు గడ్డివాము దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది స్పందించి వెంటనే అక్కడికి చేరుకొని గడ్డివాము మంటలు ఆర్పి వేశారు. ఈ గడ్డివాము 20వేల రూపాయల వరకు నష్టం జరిగిందని గడ్డివాము యజమాని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, అగ్నిమాపక సిబ్బంది, వరి కోత మిషన్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## తెలంగాణ పారిశ్రామిక రంగంలో చారిత్రాత్మక ఘట్టం




ఇబ్రహింపట్నం మే తేది 15 ప్రజా పాలన ప్రతినిధి :రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ లో సుమారు 4,000 కోట్ల పెట్టుబడీలతో, 35,000 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే ఫాక్స్ కాన్ పరిశ్రమ టెక్నాలజీ కంపెనీకి భూమిపూజ నిర్వహించిన రాష్ట్ర ఐటీ మున్సిపల్ శాఖ మంత్రివర్యులు కేటీఆర్ , విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి , ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి , ఫాక్స్ కాన్ కంపెనీ చైర్మన్ శ్రీ సిడ్నీ లూ . బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ప్రశాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాహాన్ని దోహదపడతాయి:ఎంపీపీ లలిత



మధిర మే 15 ప్రజాపాలన ప్రతినిధి:క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దృఢత్వానికి ఉపయోగపడతాయని మండల పరిషత్ అధ్యక్షురాలు మెండెం లలిత మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత పేర్కొన్నారు. సోమవారం స్థానిక టివియం పాఠశాల ఆవరణలో సీఎం కప్ మండల స్థాయి క్రీడల పోటీలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్, మధిర మున్సిపాలిటీ వైస్ చైర్పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు



మధిర, మే 15 ప్రజాపాలన ప్రతినిధి: విద్యార్థులు కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు అని రామభక్త సీతయ్య కళాపరిషత్ వ్యవస్థాపకులు బబ్లా పేర్కొన్నారు. ఇటీవల ప్రకటించిన పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో పదికి పది జిపిఎ సాధించిన పాగి శశాంక్ ని సోమవారం తన నివాసంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే తప్పకుండా ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. అనేక సంవత్సరాలుగా శ్రీ రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో మధిర పట్టణంలో ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మారోణి భాయ్, రామావత్ దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ప్రమాదకరంగా చెట్టు,అటుగా వెళ్లే ప్రజల అవస్థలు



మధిర మే 15 ప్రజాపాలనా ప్రతినిధి:మధిర పట్టణంలోని లక్ష్మీ శ్రీనివాస థియేటర్ రోడ్లో వేపచెట్టు పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా మారింది దీంతో అటువైపు వెళ్లే ప్రజలు చెట్టు విరిగిపోయి ఎప్పుడే ప్రమాదం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై వేప చెట్టును పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఈనెల 17న సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం



శంకరపట్నం మే15 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 17 బుధవారం రోజున సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించబడునని మండల పరిషత్ అధికారి ఖాజా బషీరుద్దీన్ సోమవారం తెలియజేశారు. ఈ ప్రజా వేదిక కార్యక్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో భాగంగా మండలంలోని వివిధ గ్రామపంచాయతీలో జరిగిన పనులకు సంబంధించిన 13వ విడత తనిఖీ కార్యక్రమంను నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధికారి సోమవారము తెలియజేశారు.

## తాడికల్‌లో బాల్య మిత్రునికి చేయూత



శంకరపట్నం మే 15 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో 1993-94 విద్య సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు వారి చిన్ననాటి బాల్య మిత్రుడు మహమ్మద్ సర్వర్ తాడికల్ గ్రామంలో అనారోగ్య పరిస్థితులతో మంచానికే పరిమితం అయ్యాడు. విషయం తెలుసుకున్న అతనీ స్నేహితులు సోమవారం సర్వర్ ను పరామర్శించి 10 వేల రూపాయలు నగదును ఆర్థిక సహాయం అందించి స్నేహితునికి అండగానిలిచి, ఆత్మ స్థైర్యాన్ని నింపారు. పలువురు వారిని అభినందించారు.

## అడ్మినిస్ట్రేటివ్ శిక్షణకు బిసిలు దరఖాస్తు చేసుకోవాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి**



వికారాబాద్ బ్యూరో 15 మే ప్రజాపాలన : 2023-24 సంవత్సరం అడ్మినిస్ట్రేటివ్ అఫ్ జస్టిస్, శిక్షణ పొందుటకు గాను వికారాబాద్ జిల్లాకు చెందిన బి.సి. కులముకు చెందిన లా గ్రాడ్యుయెట్ల నుండి దరఖాస్తులు కోరబడుచున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హతలు:

ఏ ఫ్యాకల్టిలో అయిన బేసిక్ డిగ్రీ హోల్డర్, భారత దేశంలో కేంద్ర చట్టం, ప్రొవెన్షియల్ చట్టం లేదా రాష్ట్ర చట్టం క్రింద స్థాపించబడిన లేదా చేర్చబడిన ఏ విశ్వ విద్యాలయం, కేంద్ర విద్యాలయము గ్రాంట్స్ కమిషన్ గుర్తించిన విద్యా సంస్థల నుండి లా కోర్స్ లో డిగ్రీ పొంది వుండాలి. జూలై 2022 నాటికి 23 సం,, నిండి 35 సంవత్సరములకు లోబడి ఉండవలెను. అభ్యర్థి తల్లి దండ్రుల సంరక్షకుని ఆదాయం గ్రామీణ ప్రాంతము వారికి రూ. 1,50,000 పట్టణ ప్రాంతము వారికి రూ. 2,00,000 కు మించరాదు. అభ్యర్థి గతములో ఇటువంటి సౌకర్యము వినియోగించుకొని ఉండరాదు. బార్ కౌన్సిల్ లో పేరు నమోదు చేసుకొని ఉండాలి. ఎంపికైన అభ్యర్థులు (03) సంవత్సరాలు అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్ శిక్షణ పొందాలి ఈ మూడు సంవత్సరాలకు ఆర్థిక సహాయము కల్పించబడును. శిక్షణ పొందు కాలములో నెలకు రూ. 1000/- ల చొప్పున స్టైఫండ్ చెల్లించబడును. అడ్వకేట్ గా ఎన్రోల్మెంట్ ఫీజ్ రూ. 585/- చెల్లించబడును.లా పుస్తకములు, ఫర్నిచర్ కొనుగోలుకు రూ. 3000/- చెల్లించబడును. ఎంపిక చేయబడు అభ్యర్థుల సంఖ్య మొత్తం (04)ఎంపిక చేయబడిన అభ్యర్థులు శిక్షణ కొరకు జిల్లా న్యాయస్థానములోని ప్రభుత్వ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కు అనుబంధం చేయబడుదురు. అభ్యర్థులు నిర్ణిత ప్రోఫార్మా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ దరఖాస్తులు జిల్లా బి.సి. అభివృద్ధి అధికారి, వికారాబాద్ జిల్లా గారి కార్యాలయము 2%అం% ఫ్లోర్ రూమ్ నం. %బా%7 లో ఈనెల 16 నుండి పొందవచ్చును. పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు అభ్యర్థి పాస్ పోర్ట్ ఫోటో, ఆదార్ కార్డు జిరాక్స్ , స్థానిక, కుల, ఆదయ దృవీకరణ పత్రములు, లా డిగ్రీ, డిగ్రీ యొక్క ప్రోవిజినల్, బార్ కౌన్సిల్ కన్సాలిడేట్ దృవీకరణ పత్రాలను ఈనెల 30 లోగా జిల్లా బిసి అభివృద్ధి అధికారి, కార్యాలయము వికారాబాద్, సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం వికారాబాద్ 2వ అంతస్థు రూమ్ నెంబర్ యస్ 7 నందు అందజేయవలసినదిగా జిల్లా కలెక్టర్, వికారాబాద్ తెలియజేశారు.

## ఎక్కడ వడ్లు కొనుగోలు కేంద్రాలు..?



మధిర మే 15 ప్రజాపాలన ప్రతినిధి: ఎక్కడ కొనుగోలు కేంద్రాలు అని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రారంభోత్సవానికే పరిమితమైనవి కొనే దాఖలాలే లేవు ప్రతి చివరి గింజ వరకు నేనే కొంటాను అన్న ప్రభుత్వం గత సంవత్సరం నుండి అసలు ఊసే ఎత్తడం లేదు ప్రస్తుతం పండించిన వడ్లు ఎవరికి అమ్మాలి..? ప్రభుత్వంమే కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఉన్నది లేదంటే ప్రైవేట్ దళారులకు అమ్ముకోవాల్సిందేయ్ నా పండించిన పంటని కొంటానని చెప్పి చాలా రోజుల నుండి రోడ్ల మీదనే ఉంచి వర్షాలకు తడిసి చివరకు మొక్కలు వచ్చి రైతులు ధాన్యం న్నీ వదిలేసి ఎవరికి అమ్ముకోకుండా చేసి కొంటానని మాయ మాటలు చెప్పి గాలికి వదిలేసింది.. ఇంతవరకు కొన్న ఊసే లేదు, గత నెలలో మొక్కజొన్న అకాల వర్షాల వల్ల కింద పడినది ప్రకృతి మానవునికి సవాలు విసిరినప్పుడు, రైతుల పరిస్థితులు బాగా లేనప్పుడు, ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన బాధ్యత లేదా?. ఎకరానికి 10,000 ఇస్తానని చెప్పి ఇంతవరకు ఇచ్చిన దాకలాలూలేవు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది కవులు రైతుల పరిస్థితి ఆత్మహత్య శరణ్యం అన్నట్టుంది.. ఇకనైనా మాటలు మాని ఎకరానికి 10000 ఇచ్చి పండించిన వరి పంటను ప్రతి గింజ వరకు ప్రభుత్వమే కొనాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాము. లేదంటే రైతులను వరి పంటతో తీసుకొని రోడ్లమీదకు వచ్చి ధర్నాలు చేయాల్సి వస్తుంది. ఈ కార్యక్రమానికి మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిసురంశెట్టి కిషోర్‌లి కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు లిదుంపా వెంకటేశ్వర్ రెడ్డిలి ఉపాధ్యక్షుడు లిపులిబండ్ల చిట్టిబాబులి యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు లితూమాటి నవీన్ రెడ్డిలి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లిదారా బాలరాజులి తదితరులు రైతులు పాల్గొన్నారు.

## అప్పనంగా కోట్లు దండుకుంటున్నారు

**మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న సర్కిల్స్ పూర్తిగా నాసిరకం.**

**బిఆర్ ఎస్ నాయకులకు అనుకూలంగా రోడ్డు విస్తరణ పనులు.**

**మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్**



మంచిర్యాల టౌన్, మే 15, ప్రజాపాలన : మంచిర్యాల మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న సర్కిల్స్ పూర్తిగా నాసిరకంగా చెపుతున్నారని, అప్పనంగా కోట్లు దండుకుంటున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు , మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రావుల ఉప్పాలయ్య డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మజీద్ లు విమర్శించారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ కు పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సర్కిల్స్ పనులు పూర్తిగా నాసిరకంగా చేపట్టారని ఆరోపించారు. చెట్లు పెరగడానికి రోడ్లు తవ్విన మట్టి నింపి కోట్ల రూపాయలు దండు కుంటున్నరని విమర్శించారు. రోడ్డు వెడల్పు చెయ్యకుండా, రహదారుల నిర్మాణం లో ముందు చూపు లేకుండా నిర్మాణాలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. దీంతో వాహన దారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. మంచిర్యాల టూ టౌన్ లో 60 ఫీట్లకు బదులు బి ఆర్ ఎస్ నాయకునికి అనుకూలంగా 55 ఫీట్లకు కుదించడం జరిగిందని, దీని పై తక్షణం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బి ఆర్ ఎస్ నాయకుల ఫ్లెక్సీలను నెలల తరబడి ఉంచడం వలన వాహన దారులకు ఇబ్బందులు తలెత్తు వున్నాయని పేర్కొన్నారు. ఈవిషయం లో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పూర్తిగా అధికార పార్టీ కి మద్దతు వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. గ్రంథాలయం లో కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నిరుద్యోగులకు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తే ఓర్వక లేక గాంధి పార్కుకు తాళాలు వేసుకొని వెళ్లారని దీని పై వివిరణ కోరగా పైనుండి ఒత్తిడి ఉందని సంబంధించిన అధికారి పొంతనలేని సమాధానం చెప్పాడని విమర్శించారు . ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామగిరి బాణేష్, మాజీ కౌన్సిలర్ పూదరి ప్రభాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తూముల నరేష్,పట్టణ ఉపాధ్యక్షులు జోగుల సదానందం, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మత్స్య గిరింద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



శంకరపట్నం మే 15 ప్రజాపాలన రిపోర్టర్: రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని శ్రీ మత్స్య గిరింద్ర స్వామి ఆలయంలో టిఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో జడ్పిటిసి లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ ఉమ్మెంతల సరోజన, మెట్టుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మైపాల్, టిఆర్ఎస్ నాయకులు సతీష్ రెడ్డి , గజ్జెల్లి హనుమంతు, మేకల కుమార్, గొడిశాల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## పొంగులేటి జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ




బోనకల్, మే 15 ప్రజాపాలన ప్రతినిధి: మండల కేంద్రం లొ ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న మెగా జాబ్ మేళా పోస్టర్ ను సోమవారం పొంగులేటి సైన్యం మండల నాయకులు ఉమ్మినేని క్రిష్ణ ఆవిష్కరించారు. మే 29 వ తేదీన ఖమ్మం లో ఎస్సార్ గార్డెన్ లో జరుగు మెగా జాబ్ మేళా లో బోనకల్ మండలంలోని అన్ని గ్రామాల యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని అర్హత ఉన్న అందరూ మీ యొక్క అర్హతను బట్టి జాబ్ తెచ్చుకోవాలని తెలియజేశారు. జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ నందు సలహాలు సూచనలు చేయడానికి ఆఫీసు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జానకిపురం సర్పంచ్ చిలక వెంకటేశ్వర్లు, బోనకల్ ఉపసర్పంచ్ యార్లగడ్డ రాఘవ, సొసైటీ డైరెక్టర్ తోటకూర వెంకటేశ్వర్లు, బండి వెంకటేశ్వర్లు, దారగాని నారాయణ, కోయినేని ప్రదీప్, బంధం తిరుపతిరావు, బీరెల్లి క్రిష్ణ, గుగులోతు రాములు, ఆదూరి ప్రసాద్, మరీదు వీరబాబు, నల్లిన బోయిన క్రిష్ణ, మందా నరసింహారావు, కొమ్మినేని నాగేశ్వరరావు, చిలుక శివ, బుంగ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత్ ను సన్మానించిన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య..



తల్లాడ, మే 15 (ప్రజా పాలన న్యూస్): తల్లాడ మండల ఫోటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్ల అధ్యక్షులుగా లిగొడ్ల ప్రశాంత్ (చెర్రీ) ఇటీవల ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య సోమవారం తల్లాడలో చెర్రీని శాలువాలు పూలమాలలతో సన్మానించి సత్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చూడాలని ఫోటోగ్రాఫర్లకు తమ ప్రభుత్వం కూడా అండగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు దుగ్గిదేవర వెంకటలాల్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వరరావు(జి.వి.ఆర్) వైరా ఏఎంసీ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు తెదేపా మండల అధ్యక్షులు కూచిపూడి వెంకటేశ్వరరావు అంబేద్కర్ నగర్ సర్పంచ్ జొన్నలగడ్డ కిరణ్ బాబు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ దరఖాస్తులను స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తాం



ఇబ్రహింపట్నం మే తేది 15 ప్రజాపాలన ప్రతినిధి :సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా వివిధ సమస్యల పై పిర్యాదులను సమర్పించడానికి వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లా అధికారులు శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ అంశాలపై 168 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి: మధిర టౌన్ ఎస్ఐ సతీష్ కుమార్



మధిర మే 15 ప్రజాపాలన ప్రతినిధి:ఈనెల 21న ఖమ్మం ఎస్బిఐ టి కళాశాలలో ఖమ్మం పోలీస్ కమిషనర్ వారిచే నిర్వహించదలచిన మెగా జాబ్ మేళను మధిర లో ఉన్న ప్రతి ఒక్క నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాల్సిందిగా కోరుతున్నాము. ఈ మెగా జాబ్ మేళకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఫామ్స్ స్థానిక పోలీస్ స్టేషన్లో అందుబాటులో ఉ ండును. కావున మీరంతా ఒకసారి పోలీస్ స్టేషన్కు వచ్చి అట్టి యొక్క అప్లికేషన్ ఫామ్ ని రిజిస్టర్ చేసుకొని వెళ్లవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## సాంగ్ షూట్ కోసం 'వీరమల్లు' సన్నద్ధం




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ – క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ సినిమా 'హరిహర వీరమల్లు'. అయితే, ఈ సినిమా టీమ్ తదుపరి షెడ్యూల్ కోసం సన్నద్ధం అయ్యింది. ఇంటర్వెల్ కి ముందు వచ్చే ఓ సాంగ్ ను షూట్ చేయడానికి దర్శకుడు క్రిష్ రెడీ అయ్యాడు. ఈ నెల నాలుగో వారం నుంచి ఈ సాంగ్ ను రామోజీ ఫిల్మ్ సిటీలో షూట్ చేయనున్నారు. కాగా మొఘల్ కాలం నాటి ఫిక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇక ఈ సినిమాలో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఓ కీలక పాత్రలో నటిస్తోంది. అలాగే ఈ మూవీలో హీరోయిన్ గా నిధి అగర్వాల్ నటిస్తోంది. ఈ సినిమాని పాన్ ఇండియా సినిమాగా తీసుకురానున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత ఏ ఎం రత్నం ఈ సినిమాని భారీగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం పవన్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరీ ఈ సినిమా ఎలా ఉండబోతుందో చూడాలి.

## కాజల్ విషయంలో ఆ తేడా తెలుస్తుంది..!



ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా స్టార్స్ అందరితో నటించి మెప్పించిన కాజల్ ఆఫ్టర్ మ్యారేజ్ తన దూకుడు తగ్గించింది. ముఖ్యంగా పెళ్లి తర్వాత వెంటనే ఒక బిడ్డకు తల్లైనా కాజల్ లుక్స్ లో చాలా మార్పులు వచ్చాయి. ఎంత అందంగా రెడీ అవుతున్నా కాజల్ లో ఇదివరకు ఉన్న ఛార్మింగ్ కనిపించట్లేదు. అది ఆమె తప్పు ఏమి కాదు. బిడ్డకు తల్లైనా తర్వాత సహజంగానే కొన్ని మార్పులు వస్తాయి. అయినా కూడా మళ్లీ హీరోయిన్ గా సత్తా చాటాలని చూస్తుంది కాజల్. ప్రస్తుతం ఇండియన్ 2 NBK108 సినిమాల్లో నటిస్తున్న కాజల్ మరో సినిమాకు సైన్ చేయలేదు. టాలీవుడ్ నుంచి కాజల్ కి పెద్దగా అవకాశాలు రావట్లేదని టాక్. కాజల్ లోని కొద్దిపాటి మార్పులు దర్శక నిర్మాతలు ఆమెను కాదనేలా చేస్తున్నాయి. అయితే కాజల్ మాత్రం తన రూట్ మార్చి ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు చేయాలని చూస్తుంది. స్టార్ హీరోల్లో కమర్షియల్ సినిమా ఆఫర్లు రాకపోయినా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేయాలని అనుకుంటుంది. అందుకే తన టీం తో స్టార్ సినిమాల కన్నా తనని సోలోగా పెట్టి చేసే కథలు ఏమన్నా ఉంటే వారికి వెల్కం అనేస్తుందట. మరో వెర్షన్ ఏంటంటే కాజల్ తో జత కట్టేందుకు స్టార్స్ ఎవరు అంతగా ఇంట్రెస్ట్ చూపట్లేదని అంటున్నారు. అయితే ఒకప్పటిలా పెళ్లైన హీరోయిన్స్ సత్తా చాటలేరన్న సెంటిమెంట్ బ్రేక్ చేసి ఈమధ్య ఆఫ్టర్ మ్యారేజ్ కూడా అదరగొట్టేస్తున్నారు హీరోయిన్స్. కాజల్ విషయంలో కూడా రానున్న రోజుల్లో ఆమె సక్సెస్ ఫుల్ కెరీర్ కొనసాగించే అవకాశం ఉంది. అయితే ఈలోగా వెరైటీ కథలతో తన టాలెంట్ చూపించాలని అనుకుంటుంది కాజల్. మరి అమ్మడికి ఇవి ఒకప్పటి ఫాం తెచ్చేందుకు సపోర్ట్ చేస్తాయా లేదా అన్నది చూడాలి.

## మహేష్ క్యారెక్టర్ లో నెగిటివ్ షేడ్స్




మహేష్ బాబు తన తాజా చిత్రాన్ని త్రివిక్రమ్ దర్శకత్వంలో చేస్తున్నాడు. అయితే, తాజాగా ఈ సినిమాకి సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ గాసిప్ నెట్టింట వైరల్ అవుతుంది. ఈ సినిమాలో మహేష్ క్యారెక్టర్ లో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని టాక్ నడుస్తోంది. ఈ చిత్రంలో మహేష్ డ్యూయల్ రోల్ లో నటించనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మహేష్ ఒక క్యారెక్టర్ లో నెగిటివ్ షేడ్స్ ఉంటాయట. అయితే, దుర్మార్గుల పై విలనీజం ఉన్న ఓ హీరో చేసే ఫైట్ ఈ సినిమాలో మెయిన్ హైలైట్ అని తెలుస్తోంది. ఇక మహేష్ –త్రివిక్రమ్ కలయికలో ఈ సినిమా వస్తుండే సరికి, ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. పైగా ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఒకేసారి రిలీజ్ చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. హారిక హాసిని క్రియేషన్స్ భారీ ఎత్తున ఈ సినిమాని ఈ సినిమాని నిర్మిస్తోంది. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను 2023 సంక్రాతికి విడుదల చేయనున్నట్లు సమాచారం.

## సెన్సార్ నుంచీ మంచి శకునములే..




టాలీవుడ్లో ఇప్పుడు ఎంతో మంది యంగ్ హీరోలు వరుసగా సినిమాలు చేస్తున్నారు. అయితే అందులో కొందరు మాత్రమే ప్రత్యేకతను చాటుకుంటోన్నారు. అలాంటి వారిలో సంతోష్ శోభన్ ఒకడు. చిన్న వయసు నుంచే సినిమాల్లో నటిస్తోన్న అతడు.. హీరోగా మారిన తర్వాత వైవిధ్యాన్ని చూపిస్తోన్నాడు. ఈ క్రమంలోనే ఇప్పుడు 'అన్నీ మంచి శకునములే' అనే మూవీ చేశాడు. సంతోష్ శోభన్ హీరోగా టాలెంటెడ్ డైరెక్టర్ నందినీ రెడ్డి తెరకెక్కించిన చిత్రమే 'అన్నీ మంచి శకునములే'. మాళవిక నాయర్ హీరోయిన్గా చేసిన ఈ మూవీని స్వప్న సినిమాస్ బ్యానర్పై ప్రియాంక దత్ నిర్మించారు. ఇందులో రాజేంద్రప్రసాద్ నరేష్ రావు రమేష్ గౌతమి రోహిణి వంటి పేరున్న నటీనటులు కీలక పాత్రలను చేశారు. మిక్కీ జే మేయర్ దీనికి మ్యూజిక్ ఇచ్చాడు. ఫుల్ లెంగ్త్ ఫ్యామిలీ ఎంటర్టైనర్గా రాబోతున్న 'అన్నీ మంచి శకునములే' సినిమాను మే 18వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. దీంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరం చేసేసింది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఈవెంట్లు ఇంటర్వ్యూలు కూడా జరిగాయి. ముఖ్యంగా కొత్త రకం ప్రమోషన్తో నిర్మాతలు ముందుకు వస్తున్నారు. సరికొత్త కాన్సెప్టుతో తెరకెక్కిన 'అన్నీ మంచి శకునములే' మూవీ తాజాగా సెన్సార్కు వెళ్లింది. ఈ సినిమాను చూసిన బోర్డు సభ్యులు ఎలాంటి కట్లు బీప్లు డైలాగ్ మ్యూట్లు లేకుండా దీనికి క్లీన్ 'యూ' సర్టిఫికెట్ను జారీ చేశారు. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రకటించింది. అంటే అన్ని వర్గాల వాళ్లూ ఈ సినిమాను చూడొచ్చన్న మాట. 'అన్నీ మంచి శకునములే' మూవీకి ఎంతో మంది స్టార్లు కూడా సపోర్టును అందిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్ను యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ లాంచ్ చేశాడు. ఇక ఆదివారం సాయంత్రం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్కు దుల్కర్ సల్మాన్ నేచురల్ స్టార్ నాని గెస్టులుగా వచ్చారు. అలాగే మరికొందరు ప్రముఖులు ఈ సినిమాకు ప్రచారం చేస్తున్నారు. దీంతో కొద్ది రోజులుగా ఈ సినిమా హడావిడే కనిపిస్తోంది.

## రంగబలి మరో దసరా అవుతుందా..?



ఒకప్పుడు స్టార్ డైరెక్టర్స్ మాత్రమే ఇండస్ట్రీ హిట్ సినిమాలు తీస్తారు.. బ్లాక్ బస్టర్ సినిమాలకు వారికి తెలిసినట్టుగా ఫార్మెట్ ఎవరికీ తెలియవు అనే టాక్ ఉండేది. కానీ ఈమధ్య యువ దర్శకులు రావడం రావడమే బ్లాక్ బస్టర్ తో సత్తా చాటుతున్నారు. ఉప్పెనతో బుచ్చి బాబు దసరాతో శ్రీకాంత్ ఓదెల ఇలాంటి దర్శకులు టాలీవుడ్ కి కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నారు. ఇప్పుడు ఇదే దారిలో మరో యువ దర్శకుడు తన సత్తా చాటేందుకు రెడీ అవుతున్నాడు. నాగ శౌర్య హీరోగా నూతన దర్శకుడు పవన్ బాసంశెట్టి డైరెక్షన్ లో వస్తున్న సినిమా రంగబలి. దసరా సినిమా నిర్మించిన సుధాకర్ చెరుకూరి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ మూవీ కూడా పీరియాడికల్ గానే వస్తుందని తెలుస్తోంది. ఆల్రెడీ అలాంటి కథతో వచ్చిన దసరా సూపర్ హిట్ కాగా మరోసారి విలేజ్ బ్యాక్ డ్రాప్ లో పీరియాడికల్ సినిమాతో రంగబలి వస్తుంది. ఈ సినిమా నాగ శౌర్య కి దసరా లాంటిదని చెప్పుకుంటున్నారు. నిర్మాత కూడా అతనే కాబట్టి ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా అనుకున్న కథను అనుకున్న విధంగా తెరకెక్కించేలా ప్లాన్ చేస్తున్నారట. నాని దసరా సినిమా కథ అంత గొప్పగా లేకపోయినా శ్రీకాంత్ టేకింగ్ కి మార్కులు పడ్డాయి. నాని నటన కూడా హైలెట్ గా నిలిచింది. మరి దసరా మ్యాజిక్ రిపీట్ చేయాలని చూస్తున్న నాగ శౌర్య ఆ రేంజ్ హిట్ అందుకుంటాడా లేదా అన్నది చూడాలి. ఈమధ్య వరుస ఫ్లాపులతో కెరీర్ ని రిస్క్ లో పడేసుకున్న నాగ శౌర్య రంగబలితో హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తున్నాడు. ఈ ఇయర్ ఆల్రెడీ ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నాగ శౌర్య అది కూడా ఫ్లాప్ అవడంతో తన అంచనాలన్నీ రంగబలి మీద పెట్టుకున్నాడు. ఈ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్ గా నటిస్తుంది. నాగ శౌర్య రంగబలి జూలై 7న రిలీజ్ ఫిక్స్ చేశారు.

## "బోయపాటి రాపో ఫస్ట్ థండర్" మైండ్ బ్లోయింగ్: ఛార్మీ కౌర్



టాలీవుడ్ యంగ్ హీరో, ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మరియు మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను మొదటిసారిగా ఒక యాక్షన్ డ్రామా కోసం చేతులు కలిపారు. ఈ చిత్రానికి తాత్కాలికంగా బోయపాటి రాపో అని టైటిల్ పెట్టారు. రామ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఫస్ట్ థండర్ పేరిట వీడియో ను విడుదల చేశారు. రామ్ పోతినేని చెప్పిన మాస్ డైలాగ్తో ఫస్ట్ థండర్ పవర్ ఫుల్ గా ఉంది. మ్యూజికల్ సెన్సేషన్ థమన్ యొక్క పవర్ ఫుల్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ హైలైట్ గా నిలవడం మాత్రమే కాకుండా, టీజర్ ను వేరే లెవెల్ కి తీసుకు వెళ్ళింది. రామ్ రగ్డ్ లుక్ చాలా బాగుంది. ఈ ఫస్ట్ వీడియో కి ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. సినీ ప్రముఖులు సైతం ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నటి, ప్రొడ్యూసర్ ఛార్మీ ఈ వీడియో పై రెస్పాండ్ అయ్యారు. మైండ్ బ్లోయింగ్ అంటూ చెప్పుకొచ్చారు. ఛార్మి కౌర్ మరియు పూరీ జగన్నాథ్ ల తో రామ్ మరొక చిత్రం డబుల్ ఇస్మార్ట్ ను చేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమా రిలీజ్ కానుంది. శ్రీలీల, సాయి మంజ్రేకర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ బోయపాటి రాపో చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 20, 2023న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో విడుదల కి సిద్ధం అవుతోంది.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989